


# నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 136 | శుక్రవారం 22 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


**గుజరాత్ దెబ్బకు చెన్నై కథ సమాప్తం...**






## రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్...



**తల్లిని, చెల్లిని తరిమేసి బాబాయిని లేపేసిన వ్యక్తి జగన్ అంటూ లోకేష్ ఫైర్**

**రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్మోహన్ రెడ్డి అని తీవ్ర విమర్శ**

**2029లోపు కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామని హామీ**

**కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ఫేక్ ఖాతాలతో కుట్ర**

**గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉంటూ సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**

ఇవాళ జగన్ ప్రెస్ మీట్ చూశాక ఆయనకు 'చీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ఇవ్వొచ్చనిపించిందని, ఆయన అద్భుత నటనకు 'భాస్కర్ అవార్డు' గ్యారంటీ అని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, జగన్‌పై, వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత కుటుంబాన్నే కాకుండా, సొంత జిల్లాను, నియోజకవర్గాన్ని కూడా జగన్ మోసం చేశారని ఆరోపించారు.

## విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

**ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం**



తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంత కాలం తరువాత ఐయూఎమ్ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు 2

# హైబ్రిడ్ విధానంలో టిడిపి మహానాడు

**19 తీర్మానాలకు పోలిట్ బ్యూరో ఆమోదం - టిడిపి అధినేత చంద్రబాబు వెల్లడి**



హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ముగిసింది. మహానాడు నిర్వహణ ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కార్యకర్తే అధినేత అనేది మహానాడులో వినిపించాలన్నారు. మహిళలకు తెలుగుదేశం ఇస్తున్న ప్రాధాన్యం మహానాడు వేదికగా అందరికీ అర్ధమయ్యేలా చాటాలని సూచించారు. సంప్రదాయ ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీ ఆవిర్భావం నుంచీ వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పారు. బీసీల అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం స్పష్టంగా వెళ్లాలని నేతలకు తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచే 2 రోజుల మహానాడు ప్రారంభిద్దామన్నారు. మండల స్థాయిలో నిర్వహిద్దామనే ప్రతిపాదనపైనా చర్చ జరగాలన్నారు. క్లస్టర్ స్థాయిలోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు

## పట్టణాభివృద్ధికి యూకే సహకారం



**ప్రతినిధి బృందంతో మున్సిపల్ అధికారుల భేటీ**

పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ, ఆధునిక రవాణా వ్యవస్థల అభివృద్ధి లక్ష్యంగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ప్రతినిధి బృందంతో రాష్ట్ర అధికారులు గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి యూకే డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ ప్రతినిధి చాజ్‌వాలియా, బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ (హైదరాబాద్) గారెత్ విన్ ఓవెన్, రాష్ట్ర ప్రభుత్వం తరపున మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్, ఏడీసీఎల్, ఏజీఐసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు. పవర్ జనరేషన్, ట్రాన్స్‌మిషన్ రంగాల్లో సహకారం, గ్రీన్ మొబిలిటీ, ఆధునిక పట్టణ రవాణా వ్యవస్థలు, నదీతీర అభివృద్ధి, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణాల్లో ఎనర్జీ ఎఫిషియెన్సీ కోసం డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్స్‌పై చర్చించారు. పెద్ద ప్రాజెక్టులకు నిధుల సమీకరణపై విస్తృతంగా చర్చించారు. యూకే ప్రతినిధులు ఎక్స్చేంజ్ ఫైనాన్స్ మోడల్స్, పీపీపీ విధానాల ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలను వివరించారు. సుస్థిర పట్టణాభివృద్ధి కోసం ప్రాజెక్టుల పైప్‌లైన్‌ను బలోపేతం చేసి, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పర్యాటకం, నాలెడ్జ్ ఎక్స్చేంజ్ రంగాల్లో సహకరించుకోవాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి.

# అసైన్డ్ ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్



**క్రయ విక్రయాలకు అనుమతిస్తారు**

**తనఖా పెట్టి రుణాలు తీసుకోవచ్చు**

**రిజిస్ట్రేషన్‌కు పట్టా, పన్ను రశీదు చాలు**

**రిజిస్ట్రేషన్ పూర్తైన 90 రోజుల తర్వాతే లావాదేవీలకు అవకాశం**

**మార్గదర్శకాలు జారీ.. లక్షల మందికి మేలు**

**త్వరలో రెండేళ్లకు హక్కులు కల్పిస్తాం**

**1.9 లక్షల చుక్కల భూములకూ విముక్తి**

**రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్**

దశాబ్దాలుగా అసైన్డ్ ఇంటి స్థలాలు కలిగిన పేదలకు మేలుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పదేళ్లు గడువు తీరిన ప్రతి అసైన్డ్ ఇంటి స్థలాన్నీ పట్టాదారుల పేరిటే రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ గురువారం మార్గదర్శకాలు విడుదల చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందులో వివరించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల లక్షలాది మంది పేదలకు పూర్తిస్థాయి శాశ్వత ఇంటిహక్కులు లభించనున్నాయి. లబ్ధిదారుకు ఇంటి స్థలం అసైన్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వు, ఇంటి పట్టాతోపాటు, ఇంటి పన్ను చెల్లించిన రశీదు ఉంటే చాలు రిజిస్ట్రేషన్ చేయాలని స్పెషల్ సీఎస్ ఆదేశించారు. అయితే, ఆ ఇంటిపట్టా లబ్ధిదారు పేరిట ఉండాలి. అందులో లబ్ధిదారుడే పొజిషన్‌లో ఉండాలి. ఇంటిస్థలం రిజిస్ట్రేషన్ అయిన 90 రోజుల తర్వాత దా నిపై క్రయ, విక్రయాలకు అవకాశం ఉంటుంది. అంటే, లబ్ధిదారు పూర్తి హక్కులతో కూడిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పొందిన 90 రోజుల తర్వాత, తిరిగి ఆ ఇంటిని అమ్ముకోవచ్చు. ఇతరులు కొనుగోలు చేయవచ్చు.

## చదివేది డిగ్రీ.. చేసేది గంజాయి రవాణా



## రూ.1990 కోట్లతో విశాఖ, మంగళగిరి అభివృద్ధి

**పలు పనులకు కేంద్రం ఆమోదం**



రాష్ట్రంలోని పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం సహకరించనుం ది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని అర్బన్ చాలెంజ్ ఫండ్(యూసీఎఫ్) ఇచ్చేందుకు జాతీయ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపింది. మొత్తం ప్రాజె క్టు వ్యయం రూ.1990.83 కోట్లు కాగా, ఇందు లో కేంద్ర సహాయం రూ.497.71 కోట్లుగా ఖరారైంది. దీంతో నగరాభివృద్ధి కార్యక్రమా లు వేగం పుంజుకోనున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నం, అమరావతి రాజధాని ప్రాం తంలోని మంగళగిరి-తాడేపల్లి నగరాల్లో నీటి సరఫరా, డ్రైనేజీ, జలశుద్ధి వ్యవస్థలు ఆధునిక రూపం సంతరించుకోనున్నాయి.

**ఫ్యూచర్ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మోడల్‌గా మధురవాడ**

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నాలుగు ప్రాజెక్టుల్లో మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని మధురవాడ జోన్ కేంద్రంగా ఉన్నాయి. ప్రభుత్వం దీనిని ఫ్యూచర్ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మోడల్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.606.78 కోట్లతో మధురవాడలో 401 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ నెట్‌వర్క్ నిర్మించనున్నారు. నగరంలోని మురుగునీటి నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించనున్నారు. నిరంతర నీటి సరఫరా చేపట్టనున్నారు. బల్క్ వాటర్ సిస్టమ్ ఆధునీకరణకు రూ.110.46 కోట్లు కేటాయించారు.

# రూ.1990 కోట్లతో విశాఖ, మంగళగిరి అభివృద్ధి

ఈ ప్రాజెక్టు ద్వారా నగర నీటి సరఫరా ఆదాయ వ్యవస్థను డిజిటలైజ్ చేయనున్నారు.

మంగళగిరి–తాడేపల్లి నగరానికి కొత్త డ్రైనేజీ వ్యవస్థ

మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో రూ.584.10 కోట్లతో 303.79 కిలోమీటర్ల డ్రైనేజీ నెట్‌వర్క్ పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 15 వేల కోట్ల విలువైన అర్బన్ ప్రాజెక్టు షెల్ఫ్‌ను సిద్ధం చేసింది.

**మున్సిపల్ బాండ్లతో కొత్త ఫైనాన్స్ మోడల్** రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ 2026 ఆగస్టు 30 నాటికి రూ.1000 కోట్ల మున్సిపల్ బాండ్లు విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటి ద్వారా నగర స్థానిక సంస్థలు దీర్ఘకాలిక మూలధనాన్ని సమీకరిస్తాయి.

# చదివేది డిగ్రీ.. చేసేది గంజాయి రవాణా

## 14 కిలోలు రైలులో తరలిస్తుండగా పట్టివేత, ఇద్దరి అరెస్ట్

.బ్రహ్మపుర్ నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలులో విజయనగరం జిల్లా చీపురుపల్లి పోలీసులు సోదాలు నిర్వహించి 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేరళకు చెందిన కొడవలం దేవీనాథ్, ఏదోతా పటమాటు జోసెఫను అరెస్ట చేశారు. చీపురుపల్లి సీఐ జి.శంకరరావు కథనం మేరకు.. కేరళ రాష్ట్రం కసర్‌గాడ్ జిల్లా కొడవలం గ్రామానికి చెందిన దేవీనాథ్, ఎర్నాకుళం జిల్లా వట్టటుపరకు చెందిన జోసెఫ్ చెడు అలవాట్లకు బానిసలై, తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని బరంపురానికి చెందిన రాహుల్ నుంచి గంజాయి కొనుగోలు చేశారు. ఈ గంజాయిని బ్రహ్మపుర్ నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ రైలులో తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా పెట్టిన పోలీసులు.. చీపురుపల్లి స్టేషన్‌లో అదే రైలు ఎక్కారు. అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగులు తనిఖీ చేయగా 14 గంజాయి బయటపడింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ సైబర్ ఫోరెన్సిక్, కంప్యూటర్ సైన్సు ఫైనలియర్ విద్యార్థులని పోలీసులు తెలిపారు. కాగా.. రైల్లో చీపురుపల్లి పోలీసులు గురువారం నిర్వహించిన తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ రుద్ర గంజాయి తరలిస్తున్న వ్యక్తులను గుర్తించింది. పోలీసులు అప్రమత్తమై నిందితులను అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

# మా తాత రాజారెడ్డిని చంపింది టీడీపీ కాదా?: జగన్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శవ రాజకీయాలు, హత్యా రాజకీయాలు చేస్తోంది చంద్రబాబేనని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో ఎవరిది గొడ్డలి పార్టీ, ఎవరిది గన్ కల్చర్, ఎవరివి కుట్ర రాజకీయాలు అనే అంశాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీపై బురద చల్లేందుకు చంద్రబాబు, కొన్ని అనుకూల మీడియా సంస్థలతో కలిసి మాఫియా ముఠాగా మారి అబద్ధాలు, దొంగ సాక్ష్యాలు సృష్టిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.హత్యా రాజకీయాలకు తమదే అతి పెద్ద బాధిత కుటుంబం జగన్ పేర్కొన్నారు. తమ కుటుంబంలో ముగ్గురు కీలక వ్యక్తులు బలయ్యారంటూ ఆయన పలు సంచలన విషయాలను ప్రస్తావించారు. 1999 ఎన్నికలకు ఏడాది ముందు చంద్రబాబు సీఎం గా ఉన్నప్పుడే తన తాత రాజారెడ్డి హత్యకు గురయ్యారని, తన తాతాను చంపింది టీడీపీ కాదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌ను పులివెందులకు పరిమితం చేయాలనే రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందన్నారు. ఈ కేసులో నిందితులను హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో దాచిపెట్టి అధికార దుర్వినియోగంతో రక్షించారని ఆరోపించారు.అసెంబ్లీలో 'నువ్వు సభకు ఎలా వస్తావో చూస్తాం' అని వైఎస్ రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు అన్న క్లిప్పింగులు ఇప్పటికీ ఉన్నాయని, ఆ మాట అన్న నాలుగు రోజులకే వైఎస్సార్ ప్రమాదంలో చనిపోయారని జగన్ గుర్తుచేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తానే చంపానని టీవీ లైవ్ షోలలో ఒప్పుకున్న దస్తగిరి అనే వ్యక్తి ఇవాళ పోలీసుల అండతో స్వేచ్ఛగా తిరుగుతున్నాడని.. చంద్రబాబుకు, దస్తగిరికి ఒకే లాయర్ (లూథ్రా) వాదిస్తున్నారని, దీని వెనుక ఎవరి క్రిమినల్ బ్రెయిన్ ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు.చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ గన్ పట్టుకుని ఇద్దరిని కాల్చిపడేశారని జగన్ అన్నారు. నందమూరి హరికృష్ణ ప్రమాదంలో చనిపోతే పరామర్శకు వెళ్లి కేటీఆర్‌తో పొత్తుల గురించి మాట్లాడిన చంద్రబాబువి శవ రాజకీయాలు కావా అని ప్రశ్నించారు. సొంత మామ, రాజకీయ భిక్ష పెట్టిన ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, సీఎం కుర్చీ, పార్టీ, గుర్తు లాక్కుని ఆయన చనిపోవడానికి కారణమైంది చంద్రబాబేనని విమర్శించారు.విజయవాడలో నిరాహార దీక్ష చేస్తున్న వంగవీటి మోహనరంగాను నరికి చంపిన కేసులో నిందితుడు వెలగపూడి రామకృష్ణబాబు ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారని జగన్ చెప్పారు. అలాగే ఎన్టీఆర్ పై దాడి కేసులో అరెస్టయి, లాడ్జీలో శవమై తేలిన మల్లెల బాబ్జీ మరణం వెనుక కూడా చంద్రబాబు హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. "నేను మంచివాడ్ని కాబట్టే మా తాతను చంపిన వాళ్లు కూడా ఇవాళ ప్రశాంతంగా తిరుగుతున్నారు.. నేను చెడ్డవాడినైతే వాళ్లు అలా ఉండేవారా?" అని జగన్ ప్రశ్నించారు.

# హైబ్రిడ్ విధానంలో టిడిపి మహానాడు

పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. సమయపాలన పాటించాలని.. ప్రతి వక్తా తమకు కేటయించిన అంశంలో నిష్ణాతుడై సమయపాలన పాటిస్తూ విషయం సూటిగా చెప్పాలని ఆదేశించారు. మహానాడులో ప్రవేశపెట్టే తీర్మానాలపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు.ల

# భగ్గుమంటున్న ఎండలు..

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు జనాలు అల్లాడిపోతున్నారు. ఈ తరుణంలో వడదెబ్బ (హీట్ స్ట్రోక్) తగిలే అవకాశం చాలా ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఒంట్లో వచ్చే నీరసాన్ని మామూలు అలసటగా భావించి నిర్లక్ష్యం చేయొద్దని, వడదెబ్బ నిమిషాల్లోనే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు.

**మెదడుపై పడే తీవ్ర ప్రభావం** పరిస్థితి విషమిస్తే వడదెబ్బ మెదడుపై ప్రభావం చూపిస్తుంది. బాధితుల్లో గందరగోళం పెరగడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలియని స్థితికి వెళ్లడం వంటివి జరుగుతాయి. ఇలాంటి ప్రవర్తన కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. లేదంటే మూత్రపిండాలు, గుండె వంటి అవయవాలు పాడైపోయే ప్రమాదం ఉంది.

**వీరికి ముప్పు చాలా ఎక్కువ** ఈ మండుతున్న ఎండల వల్ల కొందరు చాలా త్వరగా అనారోగ్యానికి గురవుతారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఎండలో పనిచేసే కూలీలు జాగ్రత్తగా ఉండాలి. అలాగే గుండెజబ్బులు, షుగర్ ఉన్నవారికి వడదెబ్బ తగిలే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.

# రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్...

జగన్ కు ఛీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇవ్వొచ్చు ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తల్లిని, చెల్లిని తరిమేశారని, బాబాయిని లేపేసి మరో చెల్లి కుటుంబానికి అన్యాయం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. "2019లో సొంత బాబాయిని లేపేసింది జగన్. మొదట గుండెపోటు అన్నారు, తర్వాత గొడ్డలి వేటు అని బయటకు వచ్చింది. ఆ తర్వాత దొంగ పేపర్‌లో నారాసుర రక్తచరిత్ర అని రాసి చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి ఫోటో వేశారు. కానీ, జగన్ ఎంత మోసగాడో ప్రజలకు అర్థమైంది. అందుకే వైసీపీకి ముద్దుగా గొడ్డలి పార్టీ అని పేరు పెట్టాం" అని లోకేష్ అన్నారు. జగన్ నటన చూస్తే తనకే ఆశ్చర్యం వేస్తుందని, బయట ముద్దులు పెట్టి లోపల గొడ్డలి పోట్లు వేయడం ఆయనకు అలవాటని వ్యాఖ్యానించారు. రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్ అని, రియల్ ఎస్టేట్ వ్యాపారి దస్తగిరిని జగన్ మేనమామ చంపేసి, తమపై కేసులు పెడతామని బెదిరించారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు కేసులకు భయపడతామా అని ప్రశ్నించారు. కడపలో ఒక పెద్దాయన ఎగిరెగిరి పడుతున్నారని, త్వరలో ఆయన సమయం కూడా వస్తుందని, చట్టాలను ఉల్లంఘించిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**2029 లోగా కడప స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం** జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడపకు ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా, ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా అని లోకేష్ ప్రజలను ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే బాధితులను పట్టించుకోలేదని విమర్శించారు. "యువగళం పాదయాత్రలో ఇదే కడప గడ్డపై నేను మిషన్ రాయలసీమను ప్రకటించాను. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానని మాట ఇచ్చి, ఇప్పుడు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నాం. గత రెండేళ్లలో రూ.లక్ష కోట్ల విలువైన పరిశ్రమలు రాయలసీమకు తెచ్చాం. 2029 ఎన్నికలలోపు కడప స్టీల్ ప్లాంట్‌లో కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభించే బాధ్యత నేను తీసుకుంటా," అని లోకేష్ హామీ ఇచ్చారు.

**కూటమి మధ్య చిచ్చుకు సైకో బ్యాచ్ కుట్ర** కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ సైకో బ్యాచ్ కుట్రలు పన్నుతోందని లోకేష్ ఆరోపించారు. "జనసేన ముసుగులో మనల్ని, టీడీపీ ముసుగులో జనసేనను ఫేక్ అకౌంట్లలో తిడతారు. మనమంతా అప్రమత్తంగా ఉండాలి. కూటమి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా జగన్ ముఠా కుట్రలను తిప్పికొట్టాలి," అని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, పల్నాడులో తోట చంద్రయ్య వంటి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

**చేసిన మంచిని చెప్పాల్సిన బాధ్యత కేడర్ దే** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని లోకేష్ తెలిపారు. పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని, దీని కోసమే ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మత్స్యకార భరోసా, చేనేత, మరమగ్గాలకు ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 16 వేల టీచర్ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని, ఉగాదికి 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చామని గుర్తు చేశారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు.

**కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి**ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేందుకు పాస్‌పోర్టు మాత్రమేనని, కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని మమేకం కావాలని లోకేష్ హితవు పలికారు. టీడీపీ కేడర్‌పై గత పాలకులు పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. "మా చుట్టూ తిరిగితే పదవులు రావు, ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయి. పనిచేసే వారిని గుర్తించడానికే మైటీడీపీ యాప్ తీసుకువచ్చాం" అని తెలిపారు.

**వర్చువల్ మహానాడును విజయవంతం చేయండ** అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పిలుపు మేరకు ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని లోకేష్ తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో కార్యకర్తలను సమీకరించి మహానాడును విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన బాధ్యత మరింత పెరిగిందని, తనకు అప్పగించిన ప్రతి పనినీ చిత్తశుద్ధితో చేస్తానని అన్నారు.

**గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండండి** నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని లోకేష్ గట్టిగా సూచించారు. పార్టీ శాశ్వతమని, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించవద్దని కోరారు. అధికారం వచ్చిందని అహంకారం చూపొద్దని, ప్రజలు ప్రతి కదలికను గమనిస్తున్నారని హెచ్చరించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి 2029లో ఎన్డీఏను గెలిపించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి కోరినట్లు కడపలోని అర్బన్ పాఠశాలలకు మౌలిక వసతులు, చెరువుల ఆధునీకరణకు నిధులు కేటాయించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**కడపలో మంత్రి నారా లోకేష్ 89వ రోజు ప్రజాదర్బార్** నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం అనంతరం నారా లోకేష్ 89వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు కులగణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. భూనిర్వాసిత కోటాలో నియమితులైన జేపీఏ ఉద్యోగుల సీనియారిటీని యథావిధిగా వన్ టైం బేసిస్ భూ నిర్వాసితుల ప్రాధాన్యత కోటా కింద కొనసాగించాలని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసిత రైతుల హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పుంగనూరు పట్టణంలోని ప్రమీలా నగర్ లో రోడ్డు ఆక్రమణకు గురైందని, సర్వే నిర్వహించి దారి ఏర్పాటుచేయాలని పట్టణానికి చెందిన హేమాద్రి కోరారు. కడప జిల్లా, పట్టణంలో బలిజ భవనానికి 50 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు బలిజ కాపులకు ఈడబ్ల్యూఎస్ కింద 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా బలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

# నీట్: చేయాల్సిందేమిటి?

ఏఐ, జీపీఎస్, ఎన్‌క్రిప్ట్ వాల్ట్‌లున్నా 48 గంటలు ప్రశ్నపత్రాన్ని కాపాడలేకపోవడం వ్యవస్థ వైఫల్యం. రేయింబవళ్లు కష్టపడిన విద్యార్థుల శ్రమ వృథా అయింది. 'నీట్' పరీక్ష రద్దుతో 650 మార్కులు ఆశించిన రాజస్థాన్‌కి చెందిన ప్రదీప్, ఢిల్లీకి చెందిన అన్షిక, గోవాలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మన పరీక్షా వ్యవస్థ విద్యార్థులకు సేవ చేయడానికా, లేక మోసం చేయడానికా? జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేయగా, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వచ్చే ఏడాది నుంచి ఓఎంఆర్ విధానానికి బదులుగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. అయితే, ఈ ప్రకటన విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంచలేకపోయింది. సికార్‌లో 'గెస్ పేపర్' పేరుతో చక్కర్లు కొట్టిన 400 ప్రశ్నల్లో దాదాపు 140 ప్రశ్నలు అసలు పేపర్‌తో సరిపోవడం, ఒక్కో కాపీ లక్షల రూపాయలకు అమ్ముడవ్వడం, సీబీఐ విచారణకు దారి తీసిన ఈ వ్యవహారం 'డిజిటల్ ఇండియా' సమర్థతను ప్రశ్నిస్తోంది. ఎన్టీఏ ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఏడాది ఏదో ఒక కొత్త వివాదం వెలుగులోకి రావడం వ్యవస్థాగత వైఫల్యం.'డిజిటల్ ఇండియా'గా ప్రపంచానికి తనను తాను పరిచయం చేసుకుంటున్న దేశంలో ఇలాంటి లీకులు ఎందుకు జరుగుతున్నాయన్నది ప్రశ్న. ఎన్క్రిప్టెడ్ వాల్ట్స్, జీపీఎస్ ట్రాకర్లు, బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఏఐ నిఘా వంటివి ఉన్నా, ఒక ప్రశ్నపత్రం పరీక్షకు 48 గంటల ముందు బయటకు రావడం అంటే వ్యవస్థలో అవినీతి, సమన్వయహీనత తీవ్రంగా ఉన్నాయని అర్థం. అమెరికాలో జీఆర్ఈ, టోఫెల్ నిర్వహించే ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ కంప్యూటర్ అడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని అనుసరిస్తుంది. ప్రతి అభ్యర్థికి వేర్వేరు ప్రశ్నలు రావడం వల్ల పేపర్ లీక్‌కు అవకాశం ఉండదు. చైనా గావ్కావో పరీక్షలో మిలిటరీ స్థాయి భద్రత అమలు చేస్తారు. టైమ్‌లాక్ డిజిటల్ బాక్సులు పరీక్ష ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు మాత్రమే తెరుచుకుంటాయి. దక్షిణ కొరియాలో ప్రశ్నపత్రం రూపొందించే వారిని పూర్తిగా వేరుచేసిన సెల్స్‌లో ఉంచుతారు; ఒక వ్యక్తి మొత్తం పేపర్ చూడలేదు. భారత్‌లో కూడా 'బ్లాక్ చైన్' ఆధారిత ఆడిట్ ట్రైల్ వ్యవస్థ అమలు చేయాలి. కంప్యూటర్ బేస్డ్ టెస్టింగ్‌ను దశలవారీగా ప్రవేశపెట్టి, డైనమిక్ క్వశ్చన్ బ్యాంక్‌ను ఉపయోగిస్తే ఒకే పేపర్‌తో లక్షల మంది పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. పరీక్షా వ్యవస్థలో జవాబుదారీతనం లేకపోతే అత్యాధునిక టెక్నాలజీ కూడా విఫలమవుతుంది. అందుకే ప్రత్యేక 'నేషనల్ ఎగ్జామినేషన్ అథారిటీ చట్టం' తీసుకురావాలి. పరీక్షా మోసాలపై ప్రత్యేక దర్యాప్తు విభాగం ఏర్పాటు చేసి, అరెస్టు అధికారాలు కల్పించాలి. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టం2024 ప్రకారం పదేళ్ల జైలుశిక్ష, భారీ జరిమానాలను కఠినంగా అమలు చేయాలి.

ఒకే రోజు దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష నిర్వహించే విధానాన్ని పునఃపరిశీలించాలి. ఏడాదిలో పలుమార్లు పరీక్షలు నిర్వహించే 'రోలింగ్ ఎగ్జామ్ విండో' విధానం తీసుకురావాలి. ప్రశ్నపత్రాల ముద్రణను పూర్తిగా ప్రభుత్వ భద్రతా యంత్రాంగం ఆధీనంలోకి తీసుకురావాలి. కేంద్ర బడ్జెట్ ముద్రణ ప్రక్రియ తరహాలోనే పరీక్షా పత్రాల ముద్రణ కూడా జరగాలి. వీటి తయారీ, ముద్రణలో పాలుపంచుకునే సిబ్బందిని నిర్దేశించిన ప్రాంగణానికి పరిమితం చేయాలి. పరీక్షలు ముగిసే వరకు ప్రొఫెసర్లను కూడా ఏకాంతంలో ఉంచాలి.

పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ ధృవీకరణతో పాటు రియల్ టైమ్ ఏఐ ఫేస్ మానిటరింగ్ అమలుచేయాలి. ప్రశ్నపత్రాల పంపిణీకి స్మార్ట్ టైమ్‌లాక్ వాల్టులు ఉపయోగించాలి. పరీక్ష ముగిసిన వెంటనే ఓఎంఆర్ స్కానింగ్‌ను కేంద్ర సర్వర్లకు నేరుగా అనుసంధానిస్తే మధ్యలో మార్పులు చేసే అవకాశం తగ్గుతుంది. విద్యార్థులు నమ్మకం కోల్పోతే, దేశ భవిష్యత్తే నష్టపోతుందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

# సమతూకమేనా?



వీధికుక్కల బెడదను నివారించడానికి పోరాడుతున్న భారత సుప్రీంకోర్టు మంగళవారం తీర్పులో తన వైఖరిని మరింత స్పష్టంచేసింది. వీధికుక్కలు మనుషుల ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించినప్పుడు రాజ్యం ఉదాసీనంగా ఉండటానికి వీల్లేదని, ఈ అంశాన్ని జంతు సంక్షేమంగా కాక, ప్రజల ప్రాణభద్రతకు సంబంధించినదిగా పరిగణించాలని న్యాయస్థానం స్పష్టంచేసింది. జీవించే హక్కును పరిరక్షిస్తున్న రాజ్యాంగంలోని 21వ అధికరణం ఈ అంశానికీ వర్తిస్తుందని న్యాయమూర్తులు తేల్చిచెప్పేశారు. ఈ తీర్పుమీద జంతుప్రేమికుల నుంచి విమర్శలు, అభ్యంతరాలు వస్తున్నప్పటికీ, ప్రజాభద్రతకూ, జంతుసంక్షేమానికీ సమప్రాధాన్యం ఇచ్చిందని సాధారణ ప్రజలు భావిస్తున్నారు.దేశ రాజధాని ఢిల్లీలో వీధికుక్కల దాడికి గురై ఒక చిన్నారి మరణించిన ఘటన ఆధారంగా ఒక ఆంగ్లదినపత్రికలో ప్రచురితమైన కథనం, టెలివిజన్ చానెళ్ళలో జరిగిన చర్చలు సుప్రీంకోర్టు చొరవకు కారణం. జస్టిస్ పార్ధీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన బెంచ్ సూమోటోగా కేసు నమోదు చేసి విచారణ ఆరంభించింది. కోర్టు చొరవతో సమాజంలోనూ ఈ అంశంపై లోతైన చర్చ జరిగింది. వీధికుక్కలను స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలన్న తన గత ఆదేశాల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టంగా ప్రకటించిన ధర్మాసనం గత తీర్పును సవాలు చేసిన అప్పీళ్ళన్నిటినీ కొట్టివేసింది. దీనితోపాటుగా ప్రధానంగా మూడు అంశాలకు సంబంధించి విస్తృతమైన వివరణలను ఇవ్వడం ద్వారా శునకాల నిర్వహణ, నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రయత్నించింది. ఆస్పత్రులు, స్కూళ్ళు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక కేంద్రాలు ఇత్యాది చోట్ల నుంచి తెచ్చిన వీధికుక్కలను స్టెరిలైజ్ చేసిన తరువాత షెల్టర్లకు తరలించాల్సిందే తప్ప, మళ్ళీ ఆ ప్రదేశాల్లో విడిచిపెట్టకూడదు. రేబిస్ సోకిన లేదా నయంకాని వ్యాధులున్న, దాడులు చేస్తున్న కుక్కలకు కారుణ్య మరణం తప్పదు. దీని అమలులో జంతువుల జనన నియంత్రణ నిబంధనలు, జీవకారుణ్య చట్టం విధానాలను పాటించాల్సిందేనని కోర్టు చెప్పినప్పటికీ, సదరు శునకాల గుర్తింపు నుంచి వాటికి మరణం ప్రసాదించడం వరకూ ఆచరణలో కారుణ్యం ఉంటుందా అని జంతుప్రేమికుల ప్రశ్న. అన్ని కుక్కలనూ పిచ్చికుక్కలుగా ముద్రవేసి అత్యంత నిర్దయగా ఇది అమలు జరిగే ప్రమాదం ఉన్నదని వారి ఆవేదన. వీధి కుక్కలకు జనం అన్నం పెట్టకూడదనీ, ఇందుకోసం మునిసిపాలిటీలే ప్రత్యేక కేంద్రాలు తెరవాలన్న ఆదేశం కూడా ఎంతమేరకు ఆచరణ సాధ్యమని వారి ప్రశ్న. ఈ తీర్పు నేపథ్యంలో, జిల్లాకు కనీసం ఒకటైనా పూర్తిస్థాయి కుక్కల స్టెరిలైజేషన్, వాక్సినేషన్ కేంద్రాన్ని విధిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తన ఆదేశాల పర్యవేక్షణను హైకోర్టులకు అప్పగించడం ద్వారా ధిక్కరణలు, ఉల్లంఘనలకు తావులేకుండా సర్వోన్నత న్యాయస్థానం ప్రయత్నించింది. షెల్టర్ల ఏర్పాటు విషయంలో ఎనిమిది వారాల్లోగా నివేదిక సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. జనన నియంత్రణ చట్టాన్ని దశాబ్దాలుగా మొక్కుబడిగా అమలు చేసిన కారణంగా ఉత్పన్నమైన సమస్య ఇది. తన తీర్పులను తానే సవరించుకుంటూ, కఠినంగా ఉంటూ వీధికుక్కల సమస్య పరిష్కారం కోసం కోర్టు ప్రయత్నిస్తోంది. అయితే, ఇకపై కోర్టు కోరుతున్న రీతిలో అంతా జరుగుతుందని కూడా అనుకోనక్కరలేదు. ప్రజలు, జంతుప్రేమికులు చొరవతో మాత్రమే ఇది సాధ్యం. వీధికుక్కల నియంత్రణ, నిర్వహణకు సంబంధించిన చట్టాలు నిర్దేశించిన లక్ష్యాల్లో సగం కూడా మునిసిపాలిటీల్లో అమలుకావడం లేదు. ఒక నగరంలో కుక్కల సంఖ్య లక్షల్లో ఉంటే, జనన నియంత్రణ చికిత్సలు వందల్లో వేలల్లో మాత్రమే జరుగుతున్నాయి. కనీసం ఎనభైశాతం కుక్కలకు స్టెరిలైజేషన్ జరగనిదే వాటి సంఖ్య అదుపులో ఉండదు. నామమాత్రపు నిధుల కేటాయింపుతో పాటు, వాటి వినియోగం కూడా స్వల్పంగా ఉంటోంది. అబద్ధపు లెక్కలతో అధికారగణమే అత్యధిక సొమ్మును తినేస్తున్నదని జంతుప్రేమికుల వాదన. స్థానిక సంస్థల నిర్లక్ష్యాన్ని ప్రజలు ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ, వాక్సినేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియలు నిర్దిష్టంగా జరిగేట్టు చేస్తే కుక్కల సంఖ్య పరిమితుల్లోనే ఉంటుంది.

# నంద్యాల రైల్వే గేట్ల సమస్యలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష



**బొమ్మల సత్రం, గాంధీనగర్ రైల్వే గేట్ల వద్ద అండర్ పాస్ లేదా బ్రిడ్జిల నిర్మాణాలపై చర్చ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఉన్నతాధికారులతో మంత్రి కీలక సమావేశం**

**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు ఈరోజు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని రెండు ప్రధాన రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ నిర్మాణాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

**బొమ్మల సత్రం శ్రీ స్నేహ వృద్ధాశ్రమం రైల్వే గేట్**

ఈ రైల్వే గేట్ వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండటానికి 'అండర్ పాస్' నిర్మించాలా? లేదా 'ఫ్లైఓవర్ బ్రిడ్జి' నిర్మించాలా? అనే అంశంపై మంత్రి ఫరూక్ గారు అధికారులతో చర్చించారు. ప్రజలకు ఏది అత్యంత సౌకర్యవంతంగా ఉంటుందనే కోణంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

**గాంధీనగర్ రైల్వే గేట్**

అదేవిధంగా, నిరంతరం ట్రాఫిక్‌తో బిజీగా ఉండే గాంధీనగర్ సమీపంలోని రైల్వే గేట్ వద్ద కూడా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అక్కడ అండర్ పాస్ వేయాలా లేక బ్రిడ్జి నిర్మించాలా అనే సాంకేతిక మరియు క్షేత్రస్థాయి అంశాలపై అధికారులతో సమీక్షించారు."నంద్యాల పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు కలగకుండా, భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులపై త్వరితగతిన నివేదికలు సిద్ధం చేయాలని . ప్రజా ప్రయోజనాలే




పరమావధిగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని " మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో టిడ్కో హౌసింగ్ స్థలాలపై మంత్రి ఫరూక్ సమీక్ష



**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణ పరిధిలోని టిడ్కో గృహాలు, హౌసింగ్ స్థలాల కేటాయింపు ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఒక ప్రత్యేక సమీక్షా సమావేశం, అనంతరం స్థలాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఫరూక్ అధికారులతో మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హౌసింగ్ మరియు టిడ్కో ప్రాజెక్టులకు సంబంధించిన పనుల పురోగతిని, లబ్ధిదారుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎలాంటి జాప్యం లేకుండా మౌలిక వసతుల కల్పన పూర్తి చేసి, అర్హులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం సంబంధిత స్థలాల పరిశీలనలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయి నివేదికలను మంత్రి ఫరూక్ గారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న మరియు ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బొగ్గులైన్ బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం





**పేదలకు 'రెండు సెంట్ల' స్థలం ఇస్తాం స్వయంగా స్థలాలను పరిశీలించిన మంత్రి ఫరూక్**

**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల బొగ్గులైన్ బాధితులకు అండగా ఉంటామని, వారికి పునరావాసం కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. గురువారం నంద్యాలలో బొగ్గులైన్ బాధితుల కొరకు స్థల సేకరణ ప్రక్రియలో భాగంగా మంత్రి ఫరూక్ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. పలు అనువైన స్థలాలను నేరుగా పరిశీలించి, బాధితులకు అన్ని వసతులతో కూడిన మెరుగైన స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

కూటమి ప్రభుత్వంలో పేదలకు 2 సెంట్ల స్థలం.. మంత్రి ఫరూక్ ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు కేవలం ఒకే ఒక్క సెంటు స్థలం ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఒక సెంటు స్థలంలో ఇల్లు కట్టుకుని జీవించడం పేదలకు ఎంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే బాధితులకు ఇప్పుడు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. "పేదలు ఆత్మగౌరవంతో, సౌకర్యవంతంగా జీవించాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సంకల్పం. అందుకే గత పాలకుల వలే కాకుండా, రెండింతల స్థలాన్ని (2 సెంట్లు) బాధితులకు అందిస్తున్నాం అని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరగతిన స్థల సేకరణ పూర్తి చేసి, పంపిణీ ప్రక్రియను చేపడతామని మంత్రి ఫరూక్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిప్యూటీ తాసిల్దార్ సంజీవ, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, స్థానిక అధికారులు, కూటమి నాయకులు మరియు ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు

# ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 21:** రాబోవు ఖరీఫ్ సీజన్లో రైతులు భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని బండి ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. బి కోడూరు గ్రామంలో గురువారం రైతు పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల యొక్క ఆవశ్యకత గురించి ఏవో రైతులకు అవగాహన కల్పించారు. వేసవికాలంలో ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవడమే కీలకమని, తద్వారా సిఫార్చేసిన ఎరువులను వాడాలని మట్టి నమూనా సేకరణ ప్రక్రియ గురించి రైతులకు వివరించారు. ప్రతి ఎకరాకు 8 చోట్ల మట్టిన మూణాలను వరి పంటకు 15 సెంటీమీటర్ల లోతు వరకు మిరప లాంటి వాణిజ్య పట్టాలకు అయితే 30 సెంటీమీటర్ల లోతు వరకు మట్టిని సేకరించాలని అన్నారు. పండ్ల తోటలు వంటి వాటికైతే రెండు మీటర్ల లోతు వరకు మట్టి నమూనా సేకరించి పరీక్షా కేంద్రాలకు పంపాలన్నారు. చౌడు నేలలను గుర్తించడం జిప్సంతో చౌడును తగ్గించే విధానం గురించి తెలిపారు. ఏ కోడూరు రైతు సేవ కేంద్రం నందు రైతులకు 50 శాతం రాయితీతో జీరుగ విత్తనాలను వ్యవసాయ అధికారి పవన్ కుమార్ రైతులకు పంపిణీ చేశారు. పచ్చి రొట్టె ఎరువుల వల్ల భూమికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. పంటలను సాగు చేసే ముందు జనుము జీలుగా పిండి పెసర సాగు చేసి తిరిగి కన్య దున్నడం వల్ల భూమిలో భూసారం పెరుగుతుందని అన్నారు. రైతులు వ్యవసాయ సిబ్బంది చెప్పే సూచనలను పాటించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సుహాసిని, శ్రీనివాసరెడ్డి గ్రామ రెవెన్యూ అధికారి తిరుపతయ్య రైతులు



# ఫరూక్ నగర్ లో మంచినీటికి ప్రజల ఇబ్బందులు.









**వేసవి, వర్ష,చలి కాలంలో మాకు ఈ కష్టాలు తప్పడం లేదు. నీళ్ళు ఇస్తారు కానీ కాసేపు మాత్రమే.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం ఫరూక్ నగర్ లో ప్రజలు నీటి కష్టాలకు గురవుతున్నారు.మంత్రి ఫరూక్ పేరు ఉన్న ఫరూక్ నగర్ లో మంచినీటి కష్టాలు ఉండడం విశేషం.వివరాల్లోకి వెళితే ఫరూక్ నగర్ లో అందరూ పనులకు వెళ్లి జీవనం సాగిస్తారు.ఉదయం వెళ్ళిన వారు సాయంత్రం ఇంటికి చేరుకుంటారు.పనులు చేసి అలసిపోయిన వారికి గుక్కెడు మంచి నీళ్లు తాగడం అంటే ఎప్పుడూ ఇస్తారో ఎవరికి తెలియడం లేదు.మంచి నీళ్ల సమస్య ఉందా అంటే అమృత పథకం పూర్తి కావడంతో ఇబ్బందులు లేవని. చెపుతునారూ కానీ కొన్ని ప్రాంతాల్లో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు.మంచి నీటి సమస్య ను సచివాలయంకు వెళ్ళి చెప్పడము అంటే అక్కడ ఎప్పుడు ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తాయని మహిళలు పేర్కొంటున్నారు.ప్రతి సంవత్సరం ఏ కాలంలో కూడా మంచినీళ్ళు సరైన సమయానికి రావని ఆరోపిస్తున్నారు.తమ సమస్య ఎన్నిసార్లు సచివాలయం దృష్టికి తీసుకొని వెళ్లాలనుకున్నా అక్కడ ఎవరూ ఉండరు.మున్సిపల్ కార్యాలయంలో కి వెళ్లి పెద్ద సారు వల్ల వద్దకు వెళితే వాళ్ళ క్రింద నౌకర్లు అనుకుంటారో ఏమో సమస్య చెపితే ఇష్టారాజ్యంగా తిడుతున్నారని మహిళలు వాపోయారు.కార్యాలయంకు సమస్య పరిష్కరించుకోవడానికి వెళితే లంచం అయినా ఇవ్వాలి తిట్లు తినైనా రావాలి.ఓట్లు వేసి గెలిపించినందుకు మాకు తగిన గుణపాఠం కావాల్సిందే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తినడానికే కష్టంగా ఉన్న మాకు డబ్బులు పెట్టీ మంచి నీళ్లు కొనాలంటే కష్టంగా ఉందన్నారు.మాకు శిల్పా మినరల్ వాటర్ ఉచితంగా ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల కాసింత ఇబ్బందులు లేకుండా ఉన్నామన్నారు.శిల్పా మోహన్ రెడ్డి,శిల్పా రవి రెడ్డి హయంలో మా వార్డులో ఏ సమస్య ఉన్నా ధైర్యంగా చెప్పేవారమని, ఒకటి,రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యేదన్నారు.శిల్పా కుటుంబాన్ని ఓడించినందుకు మాకు తగిన శాస్తి కావాల్సిందే అని చెప్పుకోవడం విశేషం.నంద్యాలలో నాయకులు, అధికారులు

పేద ప్రజలకు ఒక్క పని ఉచితంగా చేయడం లేదని,ఏ పని కావాలన్నా డబ్బు,డబ్బు అని అడుగుతున్నారని వారిపై శాపనార్థాలు పెడుతున్నారు.అధికారులు ఇప్పటికైనా పేద ప్రజల దాహార్తి తెరుస్తారో లేదో వేచిచూద్దాం.

# వేలం పాటల్లో పెరిగిన ఆదాయం

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 21:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న భోజనం గ్రామంలో గురువారం దేవాలయ భూములకు సంబంధించి వేలంపాటలను నిర్వహించారు. స్థానిక ముక్తేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన 41.02 ఎకరాల భూమిని ఒక ఏడాది పాటు కౌలు వేసుకునేందుకుగాను గురువారం బహిరంగంగా వేలంపాటలను నిర్వహించారు. గత సంవత్సరం భూములను వేలంపాటలు నిర్వహిస్తే 7 లక్షల 66 వేల రూపాయలు రాగా, ఈ ఏడాది నిర్వహించిన వేలంపాటల్లో 9 లక్షల 87 వేల 500 రూపాయల ఆదాయం వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది వేలంపాటల్లో 2 లక్షల ఇరవై ఒక్క వేల 500 రూపాయలు ఆదాయము లభించింది. నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి బి హరిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్ బొల్లవరం మల్లేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వేలంపాటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జగన్మోహన్,పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.



# పోక్సో కేసు: బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న భగీరథ్, రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు గురువారం అనుమతి ఇచ్చింది.భగీరథ్ తరపు న్యాయవాది కరుణా సాగర్, తమ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. మే 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన విజ్ఞప్తిని అంగీకరించిన న్యాయస్థానం, పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది. అదే సమయంలో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించింది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలతో మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించడానికి మే 15న హైకోర్టు నిరాకరించడంతో, మే 16న రాత్రి పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు స్వయంగా లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. భగీరథ్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా,



14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రస్తుతం భగీరథ్ చెర్లపల్లి జైల్లో ఉన్నాడు.

# జూన్ 1 నుండి ఆర్‌బీఐ కొత్త రూల్స్

## ఖాతాదారులకు ఊరట, బ్యాంకింగ్ రక్షణే లక్ష్యం! రికవరీ ఏజెంట్ల ఆగడాలకు బ్రేక్.. డిజిటల్ ఫ్రాడ్స్, ఆటో-డెబిట్ పరిమితుల్లో కీలక మార్పులు




**ఆత్మకూరు: 21 మే (నంది పత్రిక ):** సాధారణ బ్యాంక్ ఖాతాదారుల ప్రయోజనాలను రక్షించడానికి, డిజిటల్ లావాదేవీలలో మోసాలను అరికట్టడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) నూతన నిబంధనలను తీసుకువచ్చింది. జూన్ 1 నుండి ఒ+6వ్యాప్తంగా అమల్లోకి రానున్న ఈ సరికొత్త గైడ్‌లైన్స్ ద్వారా లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులకు పూర్తిగా అడ్డుకట్ట పడటంతో పాటు, ఆన్‌లైన్ పేమెంట్లు మరింత సురక్షితం కానున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు (చీదీఖీజలు) ఈ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ముఖ్యంగా రుణగ్రహీతలను రికవరీ ఏజెంట్లు వేధించకుండా చూసేందుకు ఆర్‌బీఐ 'రెస్పాన్సిబుల్ బిజినెస్ కండక్ట్' కింద కఠినమైన రూల్స్ తెచ్చింది. ఇకపై రికవరీ ఏజెంట్లు లోన్ తీసుకున్న వారికి కేవలం ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 7:00 గంటల మధ్య మాత్రమే ఫోన్ చేయాలి లేదా వారి ఇంటికి వెళ్లాలి. ఈ సమయం దాటిన తర్వాత చేసే సంప్రదింపులు నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తాయి. అప్పు తీసుకున్న వ్యక్తి కాకుండా వారి బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి వేధించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఇంటి సభ్యులలో మరణం సంభవించినప్పుడు లేదా వివాహాలు, శుభకార్యాల సమయంలో రికవరీ కోసం ఇళ్లకు వెళ్లరాదని, రికవరీ ఏజెంట్లుగా పనిచేసే వారు తప్పనిసరిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (××దీఖీ) ద్వారా శిక్షణ పొంది, సర్టిఫికేట్ కలిగి ఉండాలని స్పష్టం చేసింది. థర్డ్-పార్టీ ఏజెన్సీల రికవరీ ఏజెంట్లు కస్టమర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే, దానికి సంబంధిత బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరోవైపు మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ప్రీమియంలు లేదా క్రెడిట్ కార్డ్ బిల్లుల కోసం ఆటో-డెబిట్ (ఈ-మాండేట్) పెట్టుకునే విధానాన్ని మరింత సరళీకరించారు. గతంలో నిర్దిష్ట మొత్తం దాటితే ప్రతిసారీ ఓటీపీ (న్యూ) అదనపు అథెంటికేషన్ అవసరమయ్యేది. కానీ ఇప్పుడు 15,000 నుండి 1 లక్ష వరకు జరిగే రికరింగ్ పేమెంట్లకు అదనపు న్యూ లేకుండానే ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యేలా నిబంధనలను సవరించారు, దీనివల్ల కస్టమర్ల లావాదేవీలు మరింత సులువుగా సాగుతాయి. అలాగే ఖు×, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాల బారిన పడే కస్టమర్లను ఆదుకోవడానికి ఆర్‌బీఐ నూతన గైడ్‌లైన్స్‌ను సిద్ధం చేసింది. కస్టమర్ తప్పు లేకుండా ఏదైనా డిజిటల్ మోసం జరిగి 50,000 లోపు నష్టం వాటిల్లితే, సదరు కస్టమర్ 5 రోజుల్లోగా బ్యాంక్ మరియు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ (1930) కు ఫిర్యాదు చేస్తే బాధితుడికి నికర నష్టంలో 85 శాతం లేదా గరిష్టంగా 25,000 వరకు రీఫండ్ లభించేలా ప్రతిపాదనలు తెచ్చారు. దీనితో పాటు తక్కువ రిస్క్ ప్రొఫైల్ కలిగిన బ్యాంక్ ఖాతాదారులకు కేవైసీ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, వారు తమ లావాదేవీలను ఆటంకం లేకుండా కొనసాగించేలా ఆర్‌బీఐ గడువును పొడిగించింది. రికవరీ ఏజెంట్లు చేసే కాల్స్ రికార్డింగ్‌లను బ్యాంకులు కనీసం ఆరు నెలల పాటు భద్రపరచాలని, ఒకవేళ ఏజెంట్లు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే, కస్టమర్లు మొదట సదరు బ్యాంక్ నోడల్ ఆఫీసర్‌కు, అక్కడ 30 రోజుల్లోగా స్పందన లేకపోతే 'ఆర్‌బీఐ ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్' కు ఫిర్యాదు చేయవచ్చని ఆర్‌బీఐ పేర్కొంది.

# హెచ్చరిక బోర్డులు ఎక్కడ..?

## ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్ అండ్ బి అధికారులు..!



**పోరుమామిళ్ల, మే 21( నంది పత్రిక )**వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని మైదుకూరు రోడ్డులో మహబూబ్‌నగర్ సమీపంలో ఓ లారీ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన ఘటన స్థానికుల్లో భయాందోళనలు కలిగించింది. ప్రమాదకర మలుపులు, డివైడర్లు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ నియంత్రణ సూచికలు సరిగా లేకపోవడమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో సరైన లైటింగ్, హెచ్చరిక సూచనలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, లేకపోతే అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, సేఫ్టీ సూచనలు ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్ర మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర ని మర్యాద పూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

# కంప్యూటర్ రంగానికి పునాదులు వేసింది






## యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించింది పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మార్చింది స్వర్గీయ రాజీవ్‌గాంధి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** భారత దేశంలో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కంప్యూటర్ రంగానికి పునాదులు వేసింది భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధి అని పత్తికొండ నియోజకవర్గం కోఆర్డినేటర్ కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన స్వర్గీయ రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి కార్యక్రమానికి అధ్యక్షత వహించి పైవిధంగా ఆయన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయం నందలి రాజీవ్‌గాంధీచిత్రపటమునకు, సి క్యాంపు సెంటర్ నందలి కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందడానికి రాజీవ్ గాంధీ కృషి మరువ లేనిదని 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించారని, కేంద్ర ప్రభుత్వ సంస్థలలో సాంకేతికత పెంచి మరింత విస్తృతంగా ప్రజలకు సేవలు సత్వరమే అందేలా కృషి చేశారని, దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల రూపురేఖలు మార్చిన మహానుభావుడు రాజీవ్ గాంధీ అని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి కోసం హైదరాబాద్ లో హైటెక్ సిటీ నెలకొల్పడంలో రాజీవ్ గాంధీ తోడ్పాటు మరువలేనిదని. భారత దేశ చరిత్రలో చిన్న వయసులో ప్రధానిగా దేశానికి విశిష్టమైన సేవలు అందించి చివరకు దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గొప్ప నాయకుడు స్వర్గీయ రాజీవ్ గాంధీ అని భారతదేశ పార్లమెంట్ చరిత్రలో రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 411 లోక్ సభ స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించిందని, జాతీయ విద్యావిధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు నెలకొల్పి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందించారన్నారు. నేడు దేశ వ్యాప్తంగా 700 జవహర్ నవోదయ విద్యాలయాలలో 12 లక్షల మంది విద్యార్థి/ విద్యార్థినులు ఉన్నతమైన విద్య ఉచితంగా పొందడం రాజీవ్ గాంధి ముందు చూపునకు నిదర్శనమని భారత దేశంలో విద్యార్థులు/యువకులతో ఎక్కువగా కలిసి మాట్లాడిన ప్రధాని రాజీవ్ గాంధీ ఒక్కరే అని క్రాంతి నాయుడు అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, ఐఎన్టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, మాజీ కౌన్సిలర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జి వెంకటస్వామి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎస్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి మీసాల సుమలత, రాష్ట్ర, ఓబీసీ సెల్ సెక్రెటరీ మల్లికార్జున యాదవ్, ఐఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, డిసిసి మాజీ సెక్రెటరీ వెల్దుర్తి శేషయ్య, కాంగ్రెస్ నాయకులు కేశవ రెడ్డి, రంగస్వామి, రాజు, కిరణ్, మధు మహిళా కాంగ్రెస్ ఆర్ మద్దమ్మ, ఎల్లమ్మ, నిర్మల మొదలగు వారుపాల్గొన్నారు.

## కొల్లి నాగేశ్వరావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** రైతు బంధు కొల్లి నాగేశ్వరరావు ఆరవ వర్ధంతి కార్యక్రమం... స్థానిక సి ఆర్ భవన్ నందునిర్వహించడం జరిగింది. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, రైతు బంధుగా పేరుగాంచిన కొల్లి నాగేశ్వరరావు ఆరవ వర్ధంతి ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాధం రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ 1938లో జన్మించిన కొల్లి నాగేశ్వరరావు విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి రైతుల సమస్యల పరిష్కారానికి జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడిగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. రైతాంగ సమస్యలపై ఎప్పుడూ రాజీ పడకుండా పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. కల్తీ పత్తి బీటీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్న సమయంలో రైతుల పక్షాన నిలబడి ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు. అలాగే మంచినీటి ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నిరంతరం పోరాడిన నాయకుడు కొల్లి నాగేశ్వరరావు అని అన్నారు. జిల్లా స్థాయి నాయకుడిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి రైతాంగానికి గొంతుకగా నిలిచిందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ 2020 మే 21న ఆయన పరమపదించారని, రైతు ఉద్యమాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రైతు సమస్యలపై కొల్లి నాగేశ్వరరావుకు ఉన్న అవగాహన, నిబద్ధత ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె నాగేంద్రయ్య, సి మహేష్ , డి శ్రీనివాసరావు, కారుమర్చి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్ ) కల్లూరు మండల కార్యదర్శి బిబి రాముడు,కాశీం, చంటి తదితరులు పాల్గొని కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళు లర్పించారు.

## కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో నూతన ఆటోక్లేవ్ మిషన్ ప్రారంభించిన ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిండెంట్ కె వెంకటేశ్వర్లు



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని క్యాత్ ల్యాబ్ (క్యాత్ ల్యాబ్ ) విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోక్లేవ్ (ఆటోక్లవే ) మిషన్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధుల (హెచ్డీస్ ఫండ్స్ ) ద్వారా ఈ అత్యాధునిక మిషన్‌ను సమకూర్చడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ :-క్యాత్ ల్యాబ్ శస్త్రచికిత్సల్లో ఉపయోగించే వైద్య పరికరాలను, దుస్తులను అధిక పీడన ఆవిరి ద్వారా నూటికి నూరు శాతం క్రిమిరహితం చేస్తుందన్నారు. ఆపరేషన్ల సమయంలో రోగులకు ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా ఈ మిషన్ కీలక పాత్ర పోషిస్తుంది, తద్వారా రోగుల ఆరోగ్య భద్రత మరింత మెరుగు పడుతుంది అన్నారు.క్యాత్ ల్యాబ్ విభాగంలో రోగులకు మరింత మెరుగైన, సురక్షితమైన వైద్య సేవలు అందించడానికి ఈ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ గారితో పాటు ఆర్ .యం .ఓ డాక్టర్ వెంకటరమణ , అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ శివ బాల , డాక్టర్ పి. ప్రశాంత్ అసోసియట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ రవి కిరణ్, డాక్టర్ రాజ్ కుమార్ డాక్టర్ బిందు మరియు స్టాఫ్ నర్సులు పాల్గొనడం జరిగింది.

## నేటివ్ అరకు కాఫీ కేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి




**మంత్రాలయం , మే 21,** :- నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో ప్రభుత్వం సబ్సిడీతో నూతనంగా పెట్టిన నేటివ్ అరకు కాఫీ కేంద్రాన్ని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్రరెడ్డి గురువారం రిబ్బన్ కట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనలు పండిచిన పంటల అభివృద్ధి కొరకు మరియు డ్వాక్రా మహిళలకు అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం చేయుత అందించే ఉద్దేశ్యంలో భాగంగా మంత్రాలయంలోని వినాయక గ్రామ సమైక్య పొదుపు సంఘం సభ్యురాలు అయిన ఈశ్వరమ్మకు రూ. 6 లక్షల మంజూరు కావడంతో అరకు కాఫీ కేంద్రాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని , ప్రభుత్వం తరపున 30 శాతం సబ్సిడీతో ఏపిజిపి బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేసిందన్నారు. కర్నూలు జిల్లా లోనే మొదటి అరకు కాఫీ కేంద్రాన్ని నేటివ్ ఆర్గానిక్ కాఫీ సౌజన్యంతో కలిసి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పొదుపు మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు . అంతకుముందు ఈశ్వరమ్మ దంపతులు టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి కి శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.ప్రత్యేకంగా తయారు చేసిన అరకు టీని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపిజిపి బ్యాంకు మేనేజర్ సత్యజయకృష్ణ , ఫిల్డ్ అసిస్టెంట్ వెంకట , ఏపియం రాజశేఖర్ , ఖాజ , బసవరాజు , టీడీపీ పట్టణ అధ్యక్షుడు వరదరాజు , మండల సెక్రెటరీ కమ్మసాలి నరసింహ , యంపిటిసి బోయ వెంకటేష్ , సొసైటీ డైరెక్టర్ డిసి తిమ్మప్ప , సీనియర్ నాయకుడు అశోక్ రెడ్డి , యువ నాయకులు రచ్చుమర్రి విజయకుమార్ ,మడ్రి శివ కుమార్ , రాజన్న పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు.

## తొమ్మిది దాటితే బయటకు రావద్దు



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 21:** వడగాల్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బండి ఆత్మకూరు మండల తహసిల్దార్ పద్మావతమ్మ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రానున్న వారం రోజులపాటు తీవ్రవాడగాల్పులు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా సూచించారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలు దాటితే ప్రజలు ఎవరూ బయట తిరగరాదని, సాయంత్రం ఐదు గంటల తర్వాత మాత్రమే తమ పనులను చూసుకోవాలని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డీహైడ్రేషన్కు గురికాకుండా తాగునీరు, మజ్జిగ,నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అన్నారు. ఎండలో బయటకు వెళ్ళేటప్పుడు కాళ్లకు చెప్పులు, గొడుగు,టోపీ,పలుచటి దుస్తులను వినియోగించి ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తాసిల్దార్ విజ్ఞప్తి చేశారు.

**కడమలకాల్వ లో గ్రామసభ** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామంలో తాసిల్దార్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభను నిర్వహించారు. వన్ మంత్, వన్ విలేజ్,ఫోర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభను నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి వాటికి పరిష్కారం మార్గాలు చూపుతామని తాసిల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

# వెడ్డింగ్ కార్డ్స్, పెళ్లి పత్రికల పేరుతో ఏపీకె ఫైల్స్ పంపి సైబర్ మోసాలు చేస్తారు... జాగ్రత్త .

**తెలియని లింకులపై క్లిక్ చేయవద్దు.**

**తెలియని వ్యక్తులు పంపిన ఏపీకే ఫైల్స్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దు.**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా "వెడ్డింగ్ ఇన్విటేషన్ ", "పెళ్లి పత్రిక", "శుభలేఖ", "ఇన్విటేషన్ కార్డు " పేర్లతో మొబైల్ ఫోన్లకు ఏపీకే ఫైల్స్ పంపిస్తూ బ్యాంకు ఖాతాల నుండి డబ్బులు దోచుకుంటున్నారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గురువారం తెలిపారు.సాధారణంగా వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ద్వారా "మా పెళ్లి పత్రిక చూడండి", "ఇన్విటేషన్ ఓపెన్ చేయండి", "వెడ్డింగ్ కార్డు .ఏపీకే " వంటి పేర్లతో లింకులు లేదా ఫైల్స్ పంపుతున్నారని తెలిపారు. ఈ ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసిన వెంటనే సైబర్ నేరగాళ్లు ఫోన్‌పై నియంత్రణ సాధించి, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీ లు, యూపీఐ వివరాలు సేకరించి ఖాతాల్లోని నగదును కాజేస్తున్నారని హెచ్చరించారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు** :తెలియని లింకులపై క్లిక్ చేయవద్దు. తెలియని వ్యక్తులు పంపిన ఏపీకే ఫైల్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దు."‌.ఏపీకే " తో ముగిసే ఫైల్స్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకుండా ఉండాలి. గూగుల్ ప్లే స్టోర్ లేదా అధికారిక యాప్ స్టోర్ల ద్వారా మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేయాలి.

**తెలియని లింకులపై క్లిక్ చేయవద్దు.**

ఓటీపీ , యూపీ పిన్ , బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు. ఫోన్‌లో అనుమానాస్పద యాప్‌లు కనిపిస్తే వెంటనే తొలగించాలి.మొబైల్‌లో యాంటీ వైరస్ మరియు సెక్యూరిటీ అప్డేట్స్ తప్పనిసరిగా ఉంచాలి.ఎవరైనా మోసానికి గురి అయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.అలాగే సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలను అరికట్టగలమని, అనుమానాస్పద మెసేజ్‌లు, ఫైల్స్ వచ్చినప్పుడు వెంటనే జాగ్రత్త పడాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ప్రజలకు సూచించారు.

# జన్ జాతియ గరిమ ఉత్సవ్.



**వెలుగోడు, మే 21 (నంది పత్రిక):** వెలుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని వెలుగోడు-3 స్వర్ణ గ్రామం ఆధ్వర్యంలో విజయదుర్గ చెంచు కాలనీలో గురువారం జన్ జాతి గరిమ ఉత్సవ్2026 కార్యక్రమంలో భాగంగా జన్ సున్వాయి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా స్వర్ణ గ్రామ అధికారులు కాలనీవాసులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలు, అభ్యర్థనలను తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా విద్యుత్, డ్రైనేజీ, గృహాలు, సంక్షేమ పథకాల అమలు వంటి వాటికి సంబంధించిన కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.అధికారులు ప్రజల సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం జన్ జాతియ గరిమ ఉత్సవ్ కార్యక్రమాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు షాలు బాష, గిరిజన నాయకురాలు కొమ్మి ఊశెనమ్మ, స్వర్ణ గ్రామ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# గృహ గణన గడువులోగా పూర్తిచేయాలి






**కేంద్ర ప్రభుత్వానికి ఖచ్చితమైన జనాభా వివరాలు అందించడం సర్వే లక్ష్యం**

**ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు నమోదు చేయాలి**

**గృహ గణనలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి**

**సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ దిబాకర్ బరిహా**

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు నగరంలో కొనసాగుతున్న గృహ గణన (సెన్సస్) సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పక్కాగా పూర్తి చేయాలని కేంద్ర సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ దిబాకర్ బరిహా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఇన్చార్జి ఎన్.దిపక్ భరద్వాజ్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డితో కలిసి సుంకేసుల రోడ్డు, జిపిఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి గణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనగణన ప్రక్రియ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శించి, కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తు ప్రణాళికలకు ఉపయోగకరమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో గృహ గణన ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నగర ప్రాంతాల్లో వలసలు, అద్దె నివాసాలు అధికంగా ఉండటంతో ప్రతి ఇంటిని గుర్తించి వివరాలు సేకరించాలని సూచించారు. జిల్లా ఇన్చార్జి ఎన్.దిపక్ భరద్వాజ్ మాట్లాడుతూ..

ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు కూడా గృహ గణన సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30 లోపు ఇంటి గణన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

# తర్తూరు గ్రామంలో పశుగ్రాసం దగ్ధం ఐదు లక్షల ఆస్తి నష్టం.




**జూపాడుబంగ్లా: మే : 21: (నంది పత్రిక):** మండల పరిధిలోని తర్తూరు గ్రామంలో ప్రమాదవశాత్తు వరిగడ్డి వాములు అగ్నికి ఆహుతి అయ్యాయి. వివరాల్లోకి వెళితే గురువారం గ్రామం సమీపంలోని పొలాల్లో నీ వ్యర్థాలను కాల్చుతున్న సందర్భంగా అగ్ని కీలకలు ఎగిసిపడి సమీపంలోని కల్లాల్లో వరిగడ్డివాములకు నిప్పు అంటుకుంది. గ్రామానికి చెందిన ఉస్మాన్ భాష, మదర్ సాహెబ్ ల కు చెందిన గడ్డివాములపై అగ్ని కీలకలు ఎగిసి పడి పడడంతో వరిగడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. వెంటనే విషయము తెలుసుకున్న గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా మంటలు అదుపులోకి రాకపోవడంతో విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయాన్ని జూపాడుబంగ్లా ఎస్ఐ. కే.మల్లికార్జున కు చేరవేగా వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇద్దరు రైతులకు చెందిన వరిగడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో ఐదు లక్షల ఆస్తి నష్టం సంభవించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసుకుని వివరాలు సేకరిస్తున్నారు.

# నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచిన స్వర్గీయ నల్లగట్ల శ్రీరాములు



**రెడ్ క్రాస్ అధ్వర్యంలో 25వ నేత్ర దాన సేకరణ**

**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని స్టేట్ బ్యాంకు కాలనీలో నివసిస్తున్న నల్లగట్ల శ్రీరాములు ఈరోజు మరణించడంతో వారి కుటుంబ సభ్యులలో ఒకరైన వారి కుమారుడు కాంట్రాక్టర్ నల్లగట్ల విజయకుమార్ స్పందించి వారి తండ్రి చివరి కోరిక మేరకు నేత్రదానం చేయాలని సంకల్పించడంతో, ఈ విషయాన్ని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ కో ఆర్డినేటర్ ఖండే ఆనంద్ గురూజీకి, తెలియజేయడంతో వారు వెంటనే స్పందించి రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్లకు సమాచారం అందించగా వారు కర్నూలు నుండి టెక్నీషియన్స్ పిలిపించి అతని రెండు నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఖండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ నేను రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్గా ఎన్నికైన తర్వాత ఒక సంవత్సర కాలంలోనే శ్రీరాములుతో కలిపి 25 మందితో నేత్రాలను సేకరించి రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్ కు పంపడం జరిగిందన్నారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా మరణించిన తర్వాత మట్టిలో కలిసిపోయే దానికంటే కాలి బూడిద అయ్యేదానికంటే ఇద్దరికీ చూపులు ప్రసాదించిన వారవుతారు. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని వారు వారి కుటుంబ సభ్యులకు చివరి కోరికగా నేత్రాలను సమర్పించమని తెలియజేయవలసిందిగా కోరారు. అలాగే మన భారత దేశంలో సంవత్సరానికి సుమారు 50 వేల మందికి పైగా నేత్రాలు కోల్పోయి అంధకారంలో జీవిస్తున్నారని, అటువంటి వారికి నేత్రదానం చేసి ఈ సువిశాల ప్రపంచాన్ని చూసే విధంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు.

నేత్రదానం చేయదలచిన వారు వయసుతో సంబంధం లేకుండా, శుక్లమ ఆపరేషన్ చేయించుకున్న కూడా మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయగలరని అలాగే మరణించిన తర్వాత శరీర దానం చేయుటకు కూడా ఇప్పటికీ నలుగురు వ్యక్తులు వారు కుటుంబ సభ్యులకు తెలియజేసి మాకు లిఖితపూర్వకంగా కూడా అందజేశారన్నారు. ఇలా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నల్లగట్ల శ్రీరాములు గారి కుమారుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ వారి తండ్రి మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయమని నాకు జీవించి ఉన్నప్పుడే చెప్పడంతో వారి చివరి కోరికను తీర్చాలని ఉద్దేశంతో నేను మా కుటుంబ సభ్యులతో చర్చించి మా తండ్రి నేత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ టెక్నీషియన్స్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్,వ్యవసాయ అధికారులు తనికీలు.

**ధ్రువపత్రాలు లేని ఎరువుల విక్రయాలు నిలుపుదల.**

**14 లక్షలు విలువచేసే 108 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల.**



**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్,వ్యవసాయ అధికారులు తనికీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి, నంద్యాల ప్రసాద రావు తో కలిసి విజిలెన్స్ ూ× ప్రసాద్ నంద్యాల మండలం లో గల పలు ఎరువులు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో భాగంగా దుకాణాల లో స్టాక్ రిజిస్టర్ ,బిల్ బుక్స్, రసీదులను,దుకాణం లోని నిలువలను పరిశీలించడం జరిగింది. ఆలాగే యూరియా నిల్వలను, రోజువారీ అమ్మకాలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా దుకాణా లలో సరైన ధ్రువపత్రాలు సమర్పించనందున సుమారు 14 లక్షల విలువ గల 108 మెట్రిక్ టన్నుల ఎరువులు తాత్కాలికంగా అమ్మకపు నిలుపుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గారు మాట్లాడుతూ యూరియా వివరాలను ప్రతీ రోజు వ్యవసాయ శాఖ రూపొందించిన బోర్డు యందు అప్డేట్ చెయ్యాలని, స్టాక్ మరియు ధరల పట్టికను రోజు అప్డేట్ చేయాలని, ఎరువులను వీ౹ూ కంటే అధికంగా విక్రాయించారదనీ ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే విక్రయంచాలని,అదే విధంగా పంటలు లేని సమయంలో ఎరువుల అమ్మకాల్లో నియంత్రణ పాటించాలని,అవసరమైన అన్ని ధృవ పత్రాలు దుకాణం దారులు సరిగా నిర్వహించాలని లేనిచో ఖీజూ 1985 చట్టం ప్రకారం దుకాణాల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించడం జరిగినది.





# నంద్యాలలో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో డా. సుధాకర్, వీధి సుబ్రమణ్యం సంస్మరణ సభ నిర్వహణ





## వైసీపీ ప్రభుత్వ బాధితులకు ఘన నివాళులు అర్పించిన చీఎం ఫిరోజ్

**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** వైసీపీ పాలనలో అవమానాలు, వేధింపులకు గురై మరణించిన డా. సుధాకర్ , హత్యకు గురై డోర్ డెలివరీ చేయబడిన ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ నంద్యాల పట్టణంలోని 26వ వార్డు నందు తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు దేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీఎం ఫిరోజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చీఎం ఫిరోజ్ మాట్లాడుతూ, కరోనా వంటి విపత్కర సమయంలో ప్రజలకు సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి కనీస రక్షణ పరికరాలు, మాస్కులు ఇవ్వాలని కోరినందుకు డా. సుధాకర్ ను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా వేధించిందని, చివరకు ఆయన మరణానికి కూడా ఆ ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. ఈ రోజు వారి జ్ఞాపకార్థం వారు మరణించిన రోజున తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించడం జరిగిందన్నారు. గత వైసీపీ పాలనలో దళితులు, బడుగు బలహీన వర్గాలపై జరిగిన అన్యాయాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. ప్రజల హక్కుల కోసం మాట్లాడిన వారిని కేసులు పెట్టి, భయపెట్టి, వేధింపులకు గురిచేసిన పాలన గతంలో చూశామని విమర్శించారు. డా. సుధాకర్ ప్రజల ఆరోగ్యం కోసం, వైద్య సిబ్బంది రక్షణ కోసం మాట్లాడితే ఆయనను మానసికంగా, శారీరకంగా హింసించి అవమానించారని అన్నారు. అలాంటి సంఘటనలు రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చలుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. అదే విధంగా వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేసిన వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఇంటి వద్ద డోర్ డెలివరీ చేయడం వంటి అమానుష ఘటనలు గత వైసీపీ పాలనలో చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. జగన్ ఎస్సీలను "నా అక్కలు, చెల్లెళ్లు, తమ్ముళ్లు" అని చెప్పుకుంటూ, అదే సమయంలో వారిపై ఇలాంటి దారుణాలు జరగడం దళిత సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందని అన్నారు. దళితులకు అనేక విధాలుగా అన్యాయం చేసిన గత ప్రభుత్వ పాలనను ప్రజలు గుర్తు పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీల కోసం కేటాయించిన రూ. 33 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించడం, పలు ఎస్సీ సంక్షేమ పథకాలను రద్దు చేయడం ద్వారా గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎస్సీ కాలనీలలో రహదారులు, కాలువలు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి భావితరాలకు మెరుగైన విద్య అందించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నంద్యాలలో తీవ్ర వివక్షకు గురై 20 ఏళ్లుగా ఊరు బయట ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి చీఎం ఫరూక్ కృషితో నంద్యాల నడి బొడ్డున మున్సిపాలిటీ ఆవరణలో ఆవిష్కరించుకోవడం జరిగిందన్నారు. మంత్రి ఫరూక్ నాయకత్వంలో దళిత సోదరులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగార్జున, దళిత సంఘాల నాయకులు అడ్వకెట్ బాలస్వామి, దండోరా లక్ష్మణ్, వీ÷ూ బెనర్జీ 26వ వార్డు ఇంచార్జ్ మల్లెల భాస్కర్ టీడీపీ నాయకులు సగినాల తిమ్మయ్యా,జోసెఫ్, నాగేశ్వర రావు, సౌభాగ్య, ముత్యాల ప్రభాకర్,రాజశేఖర్ చాపిరేవుల, సుబ్బయ్య జూలేపల్లె, మాబు గుల్లి , జార్జ్, శరత్, హరుణ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు చట్టరిత్య నేరం

**- ఎంపిడిఓ మేరీ, ఎస్ ఐ జయ శేఖర్**



**కొత్తపల్లి - నంది పత్రిక :** నేటి సమాజంలో ఎంతో పరిజ్ఞానం పెరుతున్నా కూడా ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, బాల్యవివాహాలు చట్టరిత్యనేరమని ఎంపీడీఓ మేరి, ఎస్ఐ జయశేఖర్లు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనం నందు కిషోరీ వికాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు నాగేశ్వరమ్మ. కుమారిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మేరి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు పెల్లి వయస్సు ఉండాలన్నారు. అంతకు తక్కువ వయస్సు ఉన్న బాల, బాలికలకు పెల్లిల్లు బాల్యవివాహాలుగా పరిగనించ బడతాయని, అలా చేస్తే వారు శిక్షార్హులు అవుతారన్నారు. బాలికలకు ఎక్కువగా బాల్య వివాహాలు చేసేందుకు ప్రోత్సహించే ఎవ్వరైనా చట్టరిత్య నేరస్తులు అవుతారన్నారు. బాలికలను తల్లిదండ్రులు బాధ్యతగా భావించాలే తప్ప బరువుగా ఉహించుకొని బాల్యవివాహాలు చేయకూడదన్నారు. గ్రామాలల్లో ఎవ్వరైనా బాల్యవివాహాలు చేస్తుంటే అటువంటి వారి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని వెల్లడించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలణకోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు, వైద్యురాలు దీపానాగవేణి, వివిధ శాఖల అధికారులు

# "డా. సుధాకర్ జ్ఞాపకార్థం నంద్యాల జీఎస్ఆర్ హాస్పిటల్ లో ఉచిత మెడికల్ క్యాంపు.





## ముఖ్య అతిథిగా హాజరైన ఫిరోజ్"

**నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని +ూ= హాస్పిటల్ లో డా. రఫీ, డా. అరిఫా భాను ఆధ్వర్యంలో డా. సుధాకర్ జ్ఞాపకార్థం ఉచిత మెడికల్ క్యాంపు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీఎం ఫిరోజ్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఎం ఫిరోజ్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి సమయంలో వైద్యులకు సరైన రక్షణ పరికరాలు, మాస్కులు, శానిటైజర్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరిన నర్సీపట్నంకు చెందిన డాక్టర్ సుధాకర్ గత వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా సస్పెండ్ చేసి, మానసికంగా మరియు శారీరకంగా వేధింపులకు గురిచేసిందన్నారు.

ఒక వైద్యుడు ప్రజల ప్రాణాల కోసం మాట్లాడితే అతడిని రక్షించాల్సిన ప్రభుత్వం వేధించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. కరోనా సమయంలో వైద్యులు తమ కుటుంబాలను కూడా పక్కనపెట్టి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రాత్రింబవళ్లు సేవలు అందించారని గుర్తుచేశారు. అలాంటి సేవాభావం కలిగిన డాక్టర్ సుధాకర్ గారిని అవమానించడం, మానసిక వేదనకు గురిచేయడం రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. డాక్టర్ సుధాకర్ మరణం కేవలం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదని, అది వైద్య వృత్తి గౌరవంపై జరిగిన దాడిగా రాష్ట్ర ప్రజలు భావించారని తెలిపారు. వైద్యుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యులకు భద్రత, గౌరవం, మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజ సేవలో వైద్యులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు నంద్యాలలో డా. సుధాకర్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. .ఈ కార్యక్రమంలో వైద్యులు డా అనిల్ కుమార్, డా రఫీ, డా అరిఫా భాను,అడ్వకెట్ బాలస్వామి,దండోరా లక్ష్మణ్, వీ÷ూ బెనర్జీ, టీడీపీ నాయకులు జోసెఫ్, నాగేశ్వర రావు, సుబ్బయ్య జూలేపల్లె వందలాది సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి సహకారంతో తైక్వాండో అసోసియేషన్ నేషనల్ గేమ్ లో సిల్వర్ మెడల్ సాధించిన అబ్దుల్ రెహమాన్....



**ఆత్మకూరు, మే 21( నంది పత్రిక )..** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఆత్మకూరు పట్టణంలోని ఎన్టీఆర్ కెవికె స్టేడియంలో థైక్వాండో శిక్షణ తీసుకొని ఇటీవల గద్వాలలో జరిగిన తైక్వాండో అసోసియేషన్ నేషనల్ గేమ్ లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించిన అబ్దుల్ రెహమాన్ అనే క్రీడాకారుని సన్మానించిన ఆత్మకూరు మండల విద్యాధికారి అయూబ్ అహమ్మద్ మరియు ఆత్మకూరు స్పోర్ట్స్ చైర్మన్ పసిఫిల్ మున్నా టైక్వాండో శిక్షకులు కాజా హుస్సేన్ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు అత్తర్ హుస్సేన్ మరియు ఆత్మకూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించినారు

# సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం

## రైతుల సమ్మతితో నష్టపరిహార ప్రతిపాదనలకు ఆమోదం - కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, మే 21(నంది పత్రిక):-** పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ నెంబర్ లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణం కొరకు నందికొట్కూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, నందికొట్కూర్, ఆత్మకూరు మండల తాసిల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నందికొట్కూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 704లో ఉన్న రెండు ఎకరాల భూమికి సంబంధించి రైతు సమ్మతి తెలిపినందున, ఆ భూమి భూసేకరణ ప్రతిపాదనను తదుపరి ఆమోద ప్రక్రియకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 759లో సుమారు 1.50 ఎకరాల భూమికి సంబంధించి రైతుతో సావధానంగా చర్చించి సంబంధిత ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పట్టణాల్లో శాశ్వత పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నియంత్రణ మరియు ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎస్‌టిపి నిర్మాణాలు అత్యంత కీలకమని, ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, రైతుల సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



# ఆళ్లగడ్డలో రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## "వన్ మంత్ ఫోర్ విజిట్"లో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం



**నంద్యాల బ్యూరో మే,21(నంది పత్రిక):-** వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా రేపు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని కలెక్టర్ వివరించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఆర్గానిక్ పద్ధతిలో అవకాడోలు పండిస్తున్న సునీల్ శెట్టి!

బాలీవుడ్ సీనియర్ నటుడు సునీల్ శెట్టి ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం సేంద్రీయ బాట పట్టారు. తన ఫామ్‌హౌస్‌లో సేంద్రీయ వ్యవసాయం చేస్తూ ప్రకృతితో మమేకమవుతున్నారు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫామ్‌లోని అవకాడో చెట్ల వీడియోను పంచుకున్నారు. "చెట్లపై పెరిగేదే అసలైన సంపద. ఇంట్లో పండించిన అవకాడోలు. గ్రీన్ థెరపీ. స్వచ్ఛమైన ఆనందం" అని ఆ వీడియోకు క్యాప్షన్ జోడించారు. గత కొంతకాలంగా తన ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలితో సునీల్ శెట్టి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఇటీవల మనవరాలు ఎవారా పుట్టిన తర్వాత ఆయన ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. సునీల్ కుమార్తె అతియా శెట్టి, భారత టెస్ట్ క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ దంపతులకు ఎవారా మొదటి సంతానం. ఇదిలా ఉండగా, ఇటీవల మాతృదినోత్సవం సందర్భంగా సునీల్ శెట్టి కుమారుడు, నటుడు అహాన్ శెట్టి తన తల్లి మానా శెట్టి గురించి రాసిన ఓ ఎమోషనల్ పోస్ట్ అందరినీ ఆకట్టుకుంది. "నాకు అత్యంత బలం, సురక్షితమైన ప్రదేశం నువ్వే. నా నుంచి ఏమీ ఆశించకుండా నన్ను ప్రేమించే ఏకైక వ్యక్తివి అమ్మ. హ్యాపీ మదర్స్ డే" అంటూ అహాన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. ఎంత పెద్దవాడినైనా తనకు ఎప్పుడూ తల్లి అవసరం ఉంటుందని అహాన్ భావోద్వేగంగా పేర్కొన్నాడు.

ఈ పోస్ట్‌కు సునీల్ శెట్టి రెడ్ హార్ట్, దిష్టి చుక్క ఎమోజీలతో స్పందించగా, ఆయన కుమార్తె అతియా శెట్టి కూడా రెడ్ హార్ట్ ఎమోజీని కామెంట్ సెక్షన్‌లో పోస్ట్ చేసింది.



## విదేశీ పర్యటన ముగించుకున్న ఢిల్లీకి ప్రధాని మోడీ

ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనను ముగించుకుని గురువారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనల నేపథ్యంలో మోదీ ఆయా దేశాల నేతలకు భారత సంస్కృతి ఉట్టిపడేలా పలు కానుకలు అందజేశారు. ఇటలీ అధ్యక్షుడికి పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాటల సీడీలు కలిగిన మార్బుల్ ఇన్‌లే వర్క్ బాక్స్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంలో ఫేమస్ అయిన ముగా సిల్క్ శాలువాను బహుకరించారు. తెల్లని పాలరాయితో తయారుచేసిన ఈ బాక్స్‌పై లాపిస్ లాజులి, టర్కోయిస్, మాలకైట్, పగడం వంటి రాళ్లను అలంకరించారు. ఈ పె÷-టటె లోపల భారత శాస్త్రీయ సంగీతంలోని ప్రముఖులైన పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాడిన పాటల సీడీలు ఉన్నాయి. ఇక, మెలోనీకి.. అస్సాంలో 'గో÷-డలెన్ సిల్క్'గా గుర్తింపుపొందిన ముగా సిల్క్ శాలువాను బహుమతిగా ఇచ్చారు. మణిపుర్‌కు చెందిన శిరుయ్ లిలీ సిల్క్ స్కార్ఫ్‌ను కూడా గిఫ్ట్‌గా ఇచ్చారు. నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌కి చేపల ఆకృతితో ఉన్న మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ప్రధాని మోదీ అందజేశారు. ఈ మధుబని పెయింటింగ్ అత్యంత ప్రాచీనమైనది. ఈ పెయింటింగ్ భౌగోళిక గుర్తింపు పొందింది. జానపద కళను ప్రతిబింబించే ఈ పెయింటింగ్‌లు.. భారత్, నేపాల్‌లోని మిథిలా ప్రాంతంలో ఉంటాయి. పండగలు, వివాహాలు, ఆచార వ్యవహారాలు తదితర శుభకార్యాలకు సూచికగా ఈ పెయింటింగ్స్ వేస్తారు.

# అటవీ, రెవెన్యూ భూముల రికార్డులు స్పష్టంగా నవీకరించాలి

## కలెక్టర్ జి. రాజకుమారి

**రిజర్వ్ ఫారెస్ట్ భూములను ఇతర వినియోగాలకు మార్చొద్దు : అధికారులకు ఆదేశాలు**

**రీ-సర్వేలో అటవీరెవెన్యూ శాఖల సమన్వయం కీలకం : జిల్లా కలెక్టర్**

**నంద్యాల బ్యూరో, మే 21(నంది పత్రిక):-** అటవీ భూములు మరియు రెవెన్యూ భూములకు సంబంధించి రికార్డుల నవీకరణ, రీ-సర్వే ప్రక్రియలను పూర్తి స్పష్టతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అటవీ, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ నుండి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అటవీ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అటవీ భూముల వివరాల సేకరణకు ప్రత్యేక ప్రొఫార్మాలు రూపొందించినట్లు తెలిపారు. అటవీ మరియు రెవెన్యూ భూములకు సంబంధించిన అన్ని వివరాలను సూచించిన ప్రొఫార్మా-1 ప్రకారం పూర్తిస్థాయిలో నమోదు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ తరహా భూములకు సంబంధించి రెండు వేర్వేరు ప్రొఫార్మాల్లో, అలాగే సి.ఏ. ల్యాండ్స్ కు సంబంధించిన వివరాలను మూడో ప్రొఫార్మాలో పొందుపరిచి, పూర్తి సమాచారం తో సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు. ఏ భూమి అటవీ భూమి (ఫారెస్ట్ ల్యాండ్), ఏది రెవెన్యూ భూమి అనే అంశాన్ని రికార్డుల ఆధారంగా ఖచ్చితంగా నిర్ధారించాలని సూచించారు. ఫారెస్ట్ శాఖ ద్వారా రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయబడిన భూములు లేదా ఆర్.ఎస్.ఆర్ రికార్డుల్లో ఫారెస్ట్‌గా నమోదైన ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర వినియోగాలకు మార్చరాదని స్పష్టం చేశారు. అటవీ భూములను అటవీ ప్రాంతాలుగానే పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. భూములపై వ్యక్తులకు పట్టాలు ఉన్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో ముందుగా సంబంధిత భూములను "ఫారెస్ట్"గా అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చట్టపరమైన మరియు పరిపాలనా పరమైన అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. జిల్లాలో 200కుపైగా గ్రామాల్లో రీ-సర్వే వేగంగా కొనసాగుతోందని, ఫారెస్ట్ బౌండరీల నిర్ణయంలో వివాదాలు తలెత్తకుండా ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వేయర్లతో పాటు అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బౌండరీ ఫిక్సేషన్ సమయంలో ఫారెస్ట్ శాఖకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం ఇవ్వాలని, సంబంధిత సర్వేయర్లు మరియు అధికారులకు లిఖితపూర్వక కమ్యూనికేషన్ పంపాలని ఆదేశించారు. రీ-సర్వే షెడ్యూల్‌ను ఫేజ్‌వైజ్‌గా డీఎఫ్‌ఓలకు వెంటనే పంపించాలని, గ్రామ సభలు లేదా ఫీల్డ్ సందర్శనలకు కనీసం వారం ముందు అటవీ శాఖకు సమాచారం అందేలా చూడాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వెబ్‌ల్యాండ్‌లో అటవీ భూములుగా నమోదైన సర్వే నంబర్లు, ఫారెస్ట్ లైక్ ఏరియాస్, సి.ఏ ల్యాండ్స్‌కు సంబంధించిన వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో పొరపాటున రెవెన్యూ భూములుగా భావించి పట్టాలు జారీ చేసిన ప్రాంతాలు, సాగులో ఉన్న అటవీ భూములను గుర్తించి తిరిగి ఫారెస్ట్ శాఖకు అప్పగించే అంశంపై కూడా పరిశీలించాలన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలు, రెవెన్యూ రికార్డుల్లో అడవిగా నమోదైన భూములు, బయోడైవర్సిటీ కలిగిన ఫారెస్ట్ లైక్ ఏరియాస్‌ను మూడు కేటగిరీలుగా విభజించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. డోన్ మండలంలో "అడవి పోరంబోకు" నామకరణంతో ఏర్పడిన సమస్యపై సమగ్ర పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. కొత్తకోట గ్రామంలో రెవెన్యూ రికార్డుల్లో ఇంకా అటవీ భూమిగా నమోదై ఉన్న 110 ఎకరాల భూమిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. బనగానపల్లి పరిధిలో ప్రైవేట్ ఆధీనంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములపై రీ-చెక్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పాములపాడు మండలంలో ఆర్.ఓ.ఎఫ్.ఆర్ నోటిఫికేషన్ మరియు మ్యాపింగ్ మధ్య ఉన్న వ్యత్యాసాలపై సమగ్ర సర్వే నిర్వహించి మే 26లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే అజెండా-1, అజెండా-2లకు సంబంధించిన అన్ని వివరాలను మే 25లోగా కలెక్టరేట్‌కు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.



# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు..

## రూరల్ సీఐ బివి రమణ

**పండుగను శాంతియుతంగా జరుపుకోండి**

**రూరల్ సీఐ బీవీ రమణ**




**చాగలమర్రి మే 21 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలో ముఖ్యమైన పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై రాజారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో గ్రామ పెద్దలతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. బక్రీద్ పండుగను పరస్పరం ఎంతో గౌరవంగా జరుపుకోవాలని అన్నారు. కులాలకు మతాలకు వర్గాలకు అతీతంగా మతసామరస్యాలకు ప్రతీకగా గ్రామస్తులు జరుపుకోవడం ఆనవాయితీగా ఉందని ఆయన గుర్తు చేశారు. పండుగల సమయంలో ఎలాంటి వదంతులు నమ్మ వద్దన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను పట్టించుకోవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని కోరారు. ముస్లిం మత పెద్దలు సైతం మతసామరాష్యాలను కాపాడేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ రాజారెడ్డి, ప్రభుత్వ ఖాజీ యూనస్, నంద్యాల పార్లమెంట్ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్ల నాగరాజు యాదవ్, జెట్టి నాగరాజు, వీరం రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, హిందూ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా ప్రశిక్షణ కార్యక్రమం



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లాలో నిర్వహించిన "పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026" కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు అక్కమటోట రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) ఎన్. మధుకర్ జీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి , మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అలాగే రాష్ట్ర సెక్రటరీ సంధిరెడ్డి శ్రీనివాస్ , మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి , రాష్ట్ర సెక్రటరీ శ్రీమతి రెడ్డి పావని గారు, డాక్టర్ . పీవీ పార్థసారథి ఏమ్మెల్యే , కె బి ఎన్ బి నర్సింగరావు , జె . అంకల్ రెడ్డి , చంద్రమౌళి తదితరులు వివిధ అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ రెండు రోజుల ప్రశిక్షణ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ నాగేశ్వరరావు రాష్ట్ర సంఘటనా మంత్రి ఎన్ మధుకర్ జీ ని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించడం జరిగింది.

# నదుల్లో స్వచ్ఛత పనులు ముమ్మరం

**ప్రజారోగ్య పరిరక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు**

**కెసి కెనాల్, హంద్రీ నదిలో విస్తృత స్థాయిలో శుభ్రత పనులు**

**ప్రత్యేక సిబ్బంది, జెసిబిలతో చెత్త తొలగింపు**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు నగరంలోని నదులను పరిశుభ్రంగా ఉంచేందుకు నగరపాలక సంస్థ అధికారులు విస్తృత స్థాయిలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఇటీవల కెసి కెనాల్, హంద్రీ నది ప్రాంతాలను పరిశీలించి తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా కెసి కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త, మురుగును జెసిబిల సహాయంతో తొలగిస్తున్నారు. అలాగే మెట్లు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించి శుభ్రత పనులు చేపట్టారు. నది పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇరువైపులా ప్రత్యేక కార్మికులను విధుల్లో ఉంచి, మళ్లీ అపరిశుభ్రత నెలకొనకుండా పర్యవేక్షణ చేపడుతున్నారు. అదేవిధంగా ఆనంద్ టాకీస్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హంద్రీ నదిలో ఎన్నో నెలలుగా పేరుకుపోయిన గార్బేజ్‌ను భారీ స్థాయిలో తొలగిస్తున్నారు. నదులను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపాలక అధికారులు పేర్కొంటూ, చెత్తను నదుల్లో వేయకుండా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# గంటల తరబడి విద్యుత్ కోత

**-ఇబ్బందుల్లో గ్రామీణ ప్రజలు**



**కొత్తపల్లి - నంది పత్రిక:** అసలే వేసవి కాలం అందులోను కరేంట్ కోతలతో గ్రామీణ ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో గురువారం సాయంత్రం 4:45 నిమిషాలనుంచి కరెంట్ కోత ఏర్పడింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పుడు పోయిన కరేంట్ రాత్రి 7:35 గంటలకు వచ్చింది. అప్పటివరకు గ్రామస్థులు మబ్బులోనే గడిపారు. ఇదేవిధంగా గత వారంరోజులుగా పగటిపూట కూడా గంటకు ఒకసారి కరెంట్ కోత ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కొత్తపల్లి విద్యుత్ ఏఈ అబీద్కు పోన్లో సంప్రదించిగా ఆయన సమాదానం ఇవ్వకపోవడం గమనార్హం. ఇప్పటికైనా కరెంట్ సమస్యపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎరువుల అమ్మకాలు నిలుపుదల



**రుద్రవరం ప్రతినిధి మే 21 (నంది పత్రిక):** మండలంలోని ఆలమూరు గ్రామంలో ఎరువుల దుకాణాన్ని నిలబదల చేసినట్లు వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయం శేఖర్ తో కలిసి ఆలమూరు గ్రామం లోని మదీనా ఎరువుల దుకాణం ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా యూరియా 30.645 మెట్రిక్ టన్నులు,20.20.0.13, ఎరువు 2.3 టన్నులు, ఎం ఓ పి -1. 5 టన్నులు, వాటి విలువ రూ 2,72,030.50 రూపాయల విలువ గల ఎరువులను సరియైన అనుమతి పత్రాలు లేనందువలన 25 రోజుల వరకు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు.

# మహానంది వ్యవసాయ కళాశాలలో అందుబాటులో కంది రకం ఎల్ ఆర్ జి .52




**మహానంది మే 21 (నంది పత్రిక):-** మహానంది వ్యవసాయ కళాశాలలో కంది రకం ఎల్ ఆర్ జి .52 అమ్మకానికి సిద్ధంగా ఉందని కళాశాల అసోసియేట్ డీన్ డా.వి.జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటకాలం 160 నుండి 170 రోజుల వరకు ఉంటుందన్నారు. దిగుబడి సామర్థ్యం 20 నుండి 25 కింటాళ్ళ వరకు ఉంటుందన్నారు. ఒక్క కిలో విత్తనం ధర రూ.145 అన్నారు.కర్నూలు ,నంద్యాల జిల్లాలోని రైతులు కొనుగోలు చేసి అధిక లాభాలు పొందాలన్నారు.విత్తనం కొరకు సెల్ నెంబర్ 9704018629 ను సంప్రదించాలన్నారు.

# ఆఫ్రికాలో తీవ్రం అవుతున్న ఎబోలా ముందు జాగ్రత్తలు ప్రకటించిన కేంద్రం

ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆరోగ్య కార్యదర్శులు హాజరయ్యారు. సమావేశంలో ఎబోలా వైరస్ నివారణకు అవసరమైన ముందుజాగ్రత్తలు, ఆరోగ్య సన్నాహాలు, అత్యవసర స్పందన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆఫ్రికా దేశాల్లో వైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో కేంద్రం అప్రమత్త చర్యలు ప్రారంభించింది. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్, అనుమానితులను క్వారంటైన్‌లో ఉంచడం, ప్రత్యేక పరీక్షా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై రాష్ట్రాలకు వివరణాత్మక మార్గదర్శకాలు పంపింది. అదేవిధంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించింది. గతంలో అంటువ్యాధుల సమయంలో అమలు చేసిన విధానాలను మళ్లీ కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు

**ప్రభుత్వం సబ్సిడీలతో రైతులకు లాభదాయకమైన పంట అధికారులు**




**వెలుగోడు, మే 21 (నంది పత్రిక):** నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ మరియు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు మరియు పతాంజలి ఫుడ్స్ ప్రతినిధులు రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆదాయ అవకాశాలపై వివరించారు. అధికారులు మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తే రైతులకు ఎకరానికి 50 మొక్కల చొప్పున ఒక సంవత్సరం గల మొక్కలను ఉచితంగా అందజేస్తారు. అలాగే ఒక హెక్టారుకు రూ.10,500 చొప్పున సాగు ఖర్చులు మరియు అంతర పంటల సాగుకు ప్రోత్సాహక నిధులు అందించనున్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాలుగో సంవత్సరం నుండి దిగుబడిని ఇవ్వడం ప్రారంభించి సుమారు 25 సంవత్సరాల పాటు నిరంతర దిగుబడిని పొందవచ్చు అన్నారు. నిర్వహణతో రైతులు ఎకరానికి సంవత్సరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ పంట సాగుకు ప్రధానంగా నీటి వసతి అవసరమని, ఆసక్తి గల రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే పతంజలి కంపెనీ సిబ్బంది మరియు ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు, సాంకేతిక సూచనలు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పతాంజలి నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ ఎస్. రమణారెడ్డి, డిప్యూటీ మేనేజర్ జి. నాగరాజు, వేల్పనూరు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రత్యూష, రైతు బన్నూరు ధర్మారెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పీఎఫ్ఎల్ సిబ్బంది మరియు వేల్పనూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.

సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భం గా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్ పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు.

# మెడికల్ దుకాణాలు బంద్ చేయడం న్యాయమేనా.

**ఆన్లైన్ లో మందుల విక్రయాలు చేయడం నేరమా.**

**వృద్ధులు,ఒంటరి వారికి ఆన్లైన్ సేవలు అందుకుంటున్నాయి.**

**ఆన్లైన్ లో ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు లభ్యం.**

**మెడికల్ మాఫియా తీరుకు ప్రజల్లో ఆగ్రహం.**

నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక ) దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణాలు బంద్ చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మెడికల్ మాఫియా కు అనుగుణంగా ఉండాలనే వారి డిమాండ్ సబబు కాదని ప్రజలు పేర్కొంటున్నారు.ప్రధానంగా ఆన్లైన్ విక్రయాలు నిషేధించాలని డిమాండ్ తో ఒక్కరోజు బంద్ ప్రజలు విమర్శలు చేస్తున్నారు.దేశ వ్యాప్తంగా లక్షల్లో ఉన్న మెడికల్ దుకాణాలు మూసి వేయడంతో వారు తప్ప ఎవరు వ్యాపారం చేయకూడదా అని ప్రశ్నిస్తున్నారు.హోల్సేల్,రిటైల్ మెడికల్ దుకాణాలు చెప్పిన ధరలకే కొనుగోలు చేయాలా అని ప్రజలు పేర్కొంటున్నారు. ఉదాహరణకు పది రూపాయలకు విక్రయించే మందులు 100 రూపాయలకు విక్రయిస్తున్న ఏమి అనకుండా కొనుగోలు చేయాల్సిందే.ప్రజలు తక్కువ ధరకు ఎక్కడ దొరుకుతాయో అక్కడ కొనుగోలు చేస్తారు.ఇన్నేళ్లుగా మెడికల్ మాఫియా ఆడిందే ఆట,పాడిందే పాటగా దోచుకున్నారు.కాలానికి అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం ఆన్లైన్ వ్యాపారాలు పుంజుకున్నాయి.మందుల నుంచి తినుబండారాలు,వస్తువులు అన్ని ఆన్లైన్ లో చిటికెలో కష్టపడకుండా ఇంటివద్దకే వస్తున్నాయి.వృద్ధులు,ఒంటరి జీవితం గడుపుతున్న వారికి ఆన్లైన్ విక్రయాలు ఎంతో వెసలుబాటుతో పాటు డబ్బు,సమయం ఆదా అవుతుంది.వివరాల్లోకి వెళితే దేశ వ్యాప్తంగా మెడికల్ దుకాణాలు ఆన్లైన్ మందుల విక్రయాలు నిలుపుదల చేయాలని ఒక్క రోజు బందు పాటించిన విషయం విదితమే.మెడికల్ దుకాణాలు బంద్ చేయడంతో ప్రజలు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వారి స్వలాభం కోసం మెడికల్ దుకాణాలు బంద్ చేయడం మంచి పద్ధతి కాదని అంటున్నారు.హోల్సేల్,రిటైల్ దుకాణాల్లో ఎమ్మార్పీ కి ఒక్కరూపాయి తగ్గించరని అందరికీ తెలిసిన విషయమే.పట్టణాల్లో పలు మెడికల్ దుకాణాల్లో మా వద్ద మందులు కొనుగోలు చేస్తే ఎమ్మార్పీ పై 30 నుంచి 60 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని పెద్ద,పెద్ద బోర్డు లు పెట్టీ వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటున్నారు.ప్రస్తుతం వచ్చిన ఇబ్బంది ఎవరికంటే ఎమ్మార్పీ ఒక్క రూపాయి కూడా తగ్గించని వారికే ఇబ్బందులు కలుగుతున్నాయి.మేధావుల మాటల్లో ప్రస్తుతం విక్రయిస్తున్న మందులు వారికి చాలా తక్కువ ధరకు లభిస్తున్నాయని రూపాయికి వంద రూపాయలు లాభాలు గడుస్తున్నా ఆశకు అంతులేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.వాస్తవానికి మందుల దుకాణాల్లో మందులు విక్రయించడానికి ఫార్మాసిస్టు ఉండాలి, మెడికల్ దుకాణం లైసెన్సు ఎవరిపేరు మీద ఉందో వారు మాత్రమే మెడికల్ దుకాణం నిర్వహించాలనే ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా.కొందరు అలా,కొందరు ఇలా మందులు వారికి నచ్చిన విధంగా ఎందుకు విక్రయాలు చేస్తున్నారు.ప్రతి మెడికల్ దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయాలు జరపకూడదనే నిబంధనలు ఉన్నా ఆ నియమాలు పాటించరు.ప్రతి అమ్మకం పై బిల్లులు వేయకుండా కోట్లలో ప్రభుత్వానికి పన్నులు ఎగురకొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆన్లైన్ వ్యాపారంతో వారికి నష్టమే కానీ ప్రజలకు లాభమే.మెడికల్ మాఫియా ఇప్పటికైనా స్వలాభం చూసుకోకుండా ప్రజల కు ఇబ్బందులు లేకుండా చూస్తారని ఆశిద్దాం.

# మంత్రాలయంలో పోటెత్తిన భక్త జనం



మంత్రాలయం, మే 21: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు గురువారం పోటెత్తారు. భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి మంత్రాలయం కు వివిధ వాహనాల్లో చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు మంత్రాలయం చేరడంతో పుర వీదులు, మఠం ప్రాకారం, కారిడార్ లలో భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులు ముందుగా గ్రామ దేవత శ్రీ మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి భక్తులు క్యూలైన్ లలో బారులు తీరారు. మాధవరం, ఎమ్మిగనూరు, నాగలదిన్నె రోడ్లలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. రద్దీ పెరగడంతో భక్తులు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.రోడ్లపై వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

# ప్రజలు 11 సీట్లు ఇచ్చి ఇంటికి పంపిన ఇప్పటికీ తీరు మార్చుకొని జగన్ రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ఆరోపణ.





కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక రాష్ట్రంలో గడిచిన 24 మాసాలలో 100% మించి అభివృద్ధి సంక్షేమ పథకాలను చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేసిందని 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తూచా తప్పకుండా అమలు చేయడమే కాక ఎన్నికలలో ఇవ్వని హామీలను కూడా అమలు చేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందని ప్రజలలో కూటమి ప్రభుత్వానికి లభిస్తున్నటువంటి ఆదరణను చూసి జీర్ణించుకోలేక వైయస్ జగన్మోహన్ రెడ్డి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర ఆరోపించారు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం కర్నూల్ నందు నిర్వహించినటువంటి పత్రిక మరియు మీడియా ప్రతినిధుల సమావేశంలో శాసనసభ్యులు బి వి జయనాగేశ్వర్రెడ్డి, గౌరు చరిత రెడ్డి, మరియు పార్టీ నాయకులతో కలిసి మాట్లాడటం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండు సంవత్సరాల తర్వాత పత్రికల వారి ముందుకు వచ్చిచంద్రబాబునాయుడు పైన కూటమి ప్రభుత్వము పైన తప్పుడు ఆరోపణలు చేస్తూ తానేదో దేశోద్ధారకునీ లాగామాట్లాడారాణి, వారి మాట లలో ఇంకా మార్పు రాలేదని వారి అహంకారం తగ్గలేదని వారి మాటలను బట్టి తేటతెల్లమయింది. ఒకపక్క చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ నారా లోకేష్ ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పదంపై తీసుకుని వెళు తుంటే దానిని జీర్ణించుకోలేని జగన్ మోహన్ రెడ్డి తన పాత ధోరణినే అవలంబిస్తున్నారు గతంలో లాగే ప్రస్తుతం కూడా రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగము అమలు జరుపుతున్నట్లు ఫీల్ అవుతున్నారు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి భారతదేశంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంటే జగన్ మాత్రం కళ్లుండి చూడలేని కబోదిలా మాట్లాడుతున్నారని అన్నారు. తన హయాంలో కొనసాగినటువంటి హత్య రాజకీయాలను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వారిపై ఉద్యప్రయత్నం చేస్తున్నా డు గతంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ను పిచ్చివానిలా తయారు చేసి చివరికి అతనిని పొట్టన పెట్టుకున్నారు అలాగే ఎమ్మెల్సీ అనంత బాబు తన కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేశారు తన సోదరిని ఎందుకు పాడు చేశారని ప్రశ్నించిన పాపానికి అమర్నాథ్ గౌడ్ అనే చిన్న పిల్లవాడిని పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటనను జగన్ మర్చిపోయినా ఈ రాష్ట్రంలోని ప్రజానీకం మరువలేదని అంతేకాక తన సొంత బాబాయ్ వివేకానంద రెడ్డి ని అత్యగావిస్తే గుండెపోటుతో మరణించాడని, తర్వాత గొడ్డలిపోటని, తెల్లవారేసరికి తన సాక్షి పేపర్ ఛానల్ లేదు తప్పుడు ప్రచారం చేస్తూ చంద్రబాబు నాయుడు హత్య చేయించినట్లు నారాసుర రక్త చరిత్ర అంటూ కథనాన్ని ప్రచురింపజేసి తను చేసిన పాపాన్ని చంద్రబాబు నాయుడు కి అంటగట్టే ప్రయత్నం చేసి చివరికి ప్రచారం కూడా చేసుకున్నాడు. ఇది వివేకానంద రెడ్డి కుమార్తె మా తండ్రిని హత్య గావించిన వారు జగన్ దగ్గరే ఉన్నారంటూ కోర్టు మెట్ ఎక్కగా దోషులను వెనకేసుకుని వచ్చిన జగన్ హత్య రాజకీయాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు విశ్వసనీయత గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజధాని అమరావతిని నాశనం చేశారు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను ముందుకు సాగకుండా చేశారు అలాగే రాయలసీమ ప్రాంతంలోని పశ్చిమ ప్రాంతం ముఖ్యంగా కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఆదోని మంత్రాలయం ఎమ్మిగనూర్ కోడుమూరు ప్రాంతాలను సస్యశ్యామలం చేసేందుకు 2014 19 మధ్యన ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు గుండ్రేవుల ఆర్డిఎస్ వేదవతి వంటి ప్రాజెక్టులకు కృషి చేస్తే జగన్ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత రీటెండరింగ్ పేరుతో వాటిని విస్మరించారని మాట తప్పను మడమ తిప్పను అని గొప్పలు చెప్పుకునే జగన్ రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహం చేసిన వ్యక్తిని దుయ్యబట్టారు అంతేకాక రాష్ట్రంలో తను అధికారంలో ఉండగా రాజధాని పేరు చెప్పుకునే పరిస్థితి లేకుండా చేసిన జగన్ మూడు రాజధానులు అంటూ పెద్ద నాటక మాడాడు కర్నూలుకు న్యాయ రాజధాని అన్నాడు హైకోర్టు బెంచ్ అన్నా డు కనీసం ఆ ఊసే మర్చిపోయాడు ఇదేనా జగనన్న విశ్వసనీయత, ప్రస్తుతం అమరావతి రాజధాని నిర్మాణము పనులు వేగవంతంగా జరుగుతుంటే దానిని జీర్ణించుకోలేక మావిగ న్ అంటూ మరో నాటకం ఆడటానికి పూనుకున్నాడు, సామాజిక పెన్షన్లను 3000 రూపాయలు చేస్తానన్న జగన్ ఐదు సంవత్సరాలు పట్టింది అలాగే చదువుకున్న ప్రతి విద్యార్థికి అమ్మబడి అందిస్తానని కేవలం కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తింపజేసిన ఘనుడు జగన్ అయితే నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం పేరు కింద విద్యార్థి తల్లిదండ్రుల ఖాతాలో వారికి ఆర్థికంగాతోడ్పాటునందివ్వడం జరిగింది. ఈ విషయాన్ని రాష్ట్రంలో చదువుకుంటున్న ఏ విద్యార్థి తల్లిదండ్రులను అడిగిన ధైర్యంగా చెప్తారని నీలాగా డొంకు తిరుగుడుగా ప్రజలను మోసగించే తత్వము చంద్రబాబు నాయుడు కి గాని కూటమి నాయకులకు కానీ లేదని తెలియజేశారు కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళుతుందని గతంలో జగన్మోహన్ రెడ్డి చేసిన పాపానికి రాష్ట్రంలో ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయని మరెన్నో పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలి వెళ్లాయని అదే కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు నాయుడు దేశ విదేశాలలో పెట్టుబడులను ఆకర్షించడమే కాక పరిశ్రమల స్థాపనకు అహర్నిశలు కృషి చేస్తూ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శక్తి కొలది కృషి చేస్తున్నారని అలాగే ప్రతి జిల్లాను కూడా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును పారిశ్రామిక కారిడారుగా ప్రకటించి ఎన్నో పరిశ్రమల స్థాపనకు కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు అంతేకాకుండా రాయలసీమలో ముఖ్యంగా పులివెందులకు కుప్పముకు నీ అందించిన ఘనత చంద్రబాబు నాయుడు ది అని గుర్తు చేశారు రాష్ట్రంలో జరుగుతున్నటువంటి ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేని జగన్ మతిస్థిమితం కోల్పోయిన వాడిలా ప్రవర్తిస్తున్నాడని అన్నారు. కల్తీ మద్యమం సంబంధించి జోగి రమేష్ చేసినటువంటి ఘాతకం బట్టబయలు కావడంతో దిక్కుతోచక వారికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజుయ్యద్వ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ జిల్లా గ్రంథాలయం చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీకాంత్ రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ సంజీవ్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి పద్మలతారెడ్డి డి జేమ్స్ నంద్యాల నాగేంద్ర ఎల్ వి ప్రసాద్ వెంకట్ రాముడు ఎస్ ముంతాజ్ విజయకుమార్ సంజీవలక్ష్మి రవికుమార్ కే లక్ష్మీనారాయణ డాక్టర్ కె వి సుబ్బారెడ్డి బాలరాజ్ వినంది మధు పేర పోగురాజు సత్రం రామకృష్ణుడు, పి హనుమంతరావుచౌదరి ముత్యాల తిరుపాల్ చంద్రకాంత్ అశోక్ కుమార్ రవిశర్మ కుంపటి కృష్ణ భేతం కృష్ణుడు మొదలగువారు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో టెక్నికల్ యూరియా వాడాలి.

**వ్యవసాయానికి ఉపయోగించే యూరియా వాడరాదు.**

**..ఎస్వీవై ఆగ్రో ఇండస్ట్రీస్,నంది డైరీ లో తనికిలు.**



నంద్యాల సిటీ బ్యూరో మే 21 ( నంది పత్రిక ) నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఆగ్రో ఇండస్ట్రీస్, నంది డెయిరీ పరిశ్రమలను జిల్లా వ్యవసాయ అధికారి, నంద్యాల శ్రీ నున్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ లకు సంబంధించిన అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు . అక్కడ ఉపయోగిస్తున్న యూరియా ను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జిల్లా లో వివిధ పరిశ్రమలు అనగా లిక్కర్, పెయింట్స్, ప్లాస్టిక్, డెయిరీ మొదలగు వాటిని యూరియా వాడకంపై తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, సాధారణంగా పరిశ్రమలకు టెక్నికల్ గ్రేడ్ యూరియా వాడతారని, వ్యవసాయానికి వాడే యూరియా ఉపగించరాదని తెలిపారు. ప్రస్తుతం తనిఖీ చేసిన పరిశ్రమలో టెక్నికల్ గ్రేడ్ యూరియానే ఉపయోగిస్తున్నారని నిర్ధారించుకోవడం జరిగిందని తెలిపారు. కావున జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యం టెక్నికల్ గ్రేడ్ యూరియా తప్ప వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను వాడరాదని, ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవసాయ యూరియా వాడితే వారిపై ఖీజూ 1985 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధరరావు ,నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు , సాంకేతిక వ్యవసాయ అధికారి కళ్యాణ్ పాల్గొనడం జరిగినది

## హోం గార్డ్స్ కుటుంబాలకు రూ.4 లక్షల ఆర్థిక సహాయం చెక్కులు అందజేసిన హోంగార్డ్స్ సదరన్ రిజియన్ కమాండెంట్ యం. మహేష్ కుమార్





కర్నూల్ ప్రతినిధి నంది పత్రికకర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు హోం గార్డ్స్ కాంట్రిబ్యూషన్ ఫండ్ నుండి మంజూరైన చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో హోం గార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ యం. మహేష్ కుమార్ గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.కాంట్రిబ్యూషన్ ఫండ్ నుండి మంజూరైన మొత్తం రూ.4 లక్షల విలువైన రెండు చెక్కులను హోం గార్డ్స్ కుటుంబ సభ్యులకు అందజేశారు. 1) ఆదోని యూనిట్‌కు చెందిన హోం గార్డు వెంకటేశులు పదవీ విరమణ పొందారు. రిటైర్మెంట్ గ్రాంట్ కింద రూ.2 లక్షల చెక్కును అందజేశారు. 2) కర్నూలు యూనిట్‌కు చెందిన హోంగార్డు కృష్ణ మృతి చెందారు. అతని భార్య సునీత కు మరణానంతర సహాయంగా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో హోం గార్డు ఆర్ఐ పోతల రాజు, ఏఆర్ ఎస్సైలు కాంతరెడ్డి, ఎం. మహేశ్వరయ్య, మల్లికార్జున రెడ్డి, పోలీసు సిబ్బంది మరియు హోం గార్డ్స్ పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి నిర్లక్ష్యం.. డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ

**ప్రమాదాలకు కారణం ఎవరు..?**

**ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు**



పోరుమామిళ్ల, మే 21 (నంది పత్రిక): వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని మైదుకూరు రోడ్డులో మహబూబ్‌నగర్ సమీపంలో ఓ లారీ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన ఘటన స్థానికుల్లో భయాందోళనలు కలిగించింది. ప్రమాదకర మలుపులు, డివైడర్లు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ నియంత్రణ సూచికలు సరిగా లేకపోవడమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో సరైన లైటింగ్, హెచ్చరిక సూచనలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, లేకపోతే అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, సేఫ్టీ సూచనలు ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు చీఫ్ గంగన్న, సెక్రటరీ ఫణి రావు, ఆఫీస్ సెక్రటరీ కె. ప్రవీణ్ తీవ్రంగా ఖండించారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రమాద ప్రాంతాల్లో అత్యవసర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



# దళితుల హక్కుల కోసం జడ శ్రావణ్ కుమార్ పోరాటం అభినందనీయం : మాల మహానాడు నాయకులు

బద్వేల్,మే 21 (నంది పత్రిక ): మాల మహానాడు జి చెన్నయ్య వర్గం నాయకులు విజయవాడలో జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు జ్యేష్ఠాది భాస్కర్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు మంచా సాయి, కడప జిల్లా ఉపాధ్యక్షులు బేరీ అహరోన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో దళిత సామాజిక వర్గానికి ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతూ, దళితుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న జడ శ్రావణ్ కుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దళిత సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా చట్టపరమైన పోరాటాలు చేస్తూ అండగా నిలుస్తున్న ఆయన సేవలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.



# బాలిక అదృశ్యంపై కేసునమోదు

**- ఎస్ ఐ జయ శేఖర్**

కొత్తపల్లి – నంది పత్రిక: మండల పరిధిలోని ఓ గ్రామంలో ఓ బాలిక అదృశ్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ గురువారం రాత్రి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని శివపురం గ్రామానికి చెందిన నందిని(16) అనే బాలిక మంగళవారం సాయంత్రం ఎవరులేని సమయంలో ఇంటినుంచి బయటకు వెల్లింది. ఇంక తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుప్రక్కల గ్రామాలు, బంధుల గ్రామాలలో వెతికారు అయిన దోరకలేదు. దీంతో తల్లి సరస్వతి బుధవారం రాత్రి పోలీసు స్టేషన్కు వచ్చి పిర్యాదు చేసిందని తెలిపారు. ఆమె పిర్యాదు మేరకు బాలిక అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## టిడిపి నాయకుని మృతి

**పార్టీకి తీరని లోటు.. భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి**



చాగలమర్రి మే 21 నంది పత్రిక మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో అనారోగ్య కారణంగా మృతి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పకీర మృతి పార్టీకి తీరని లోటని ఆళ్లగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి సంతాపం తెలుపుతూ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ భూమా కుటుంబం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వెన్నంటి అండగా ఉంటామన్నారు. ఈయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ఎండల తీవ్రతపై అప్రమత్రత.. ఎంపీడీవో డి. గోపికృష్ణ



**జూపాడుబంగ్లా :మే: 21: (నంది పత్రిక)** మండలంలో ఎండల తీవ్రతతో రోజురోజుకు ఉష్ణోగ్రతలు ఈ ప్రయత్నం గా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎండ దెబ్బ నుంచి తమను తాము రక్షించుకోవాలి. అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో డి. గోపికృష్ణ సూచించారు. వేసవి తాపం ప్రాణాంతముగా మారే అవకాశం ఉన్నందున. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత వడగాల్పులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచించారు. వృద్ధులు చిన్నపిల్లలు గర్భిణీలు ఎండ తీవ్రతకు గురి అయ్యే అవకాశం ఉన్నందున వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా తగినంత తాగునీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి పానీయాలు తీసుకోవాలన్నారు. ఎండలో పని వస్తే కచ్చితంగా తలకు టోపీ లేదా తెల్లటి గుడ్డను ధరించాలిన్నారు. ఎండలో శ్రమిస్తున్న ఉపాధి కూలీలు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలు జాగ్రత్తగా ఉండాలి.

**:-పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు...!**

**మధ్యాహ్నం ప్రయాణాలు రద్దు చేసుకోవాలి.**

అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు ప్రజలు రాకూడదు. - ద్రువపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. దాహం ఇయ్యకపోయినా ప్రతి గంటకు ఒకసారి నీరు తాగాలి. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు లేత రంగు సుతిమెత్తని కాటని దుస్తులు ధరించాలి. గొడుగు టోపీ లేదా తలకు రుమాలు తప్పనిసరిగా వాడుకోవాలి. ఎండ తీవ్రత సమయంలో మధ్యము టీ, కాఫీ, సీత పానియాలు (కూల్ డ్రింక్స్ ) తాగడం వల్ల డీ హైడ్రోజన్ ముప్పు పెరుగుతుందన్నారు. విపరితమైన తలనొప్పి, కళ్ళు తిరగడం, వాంతులు , ఒళ్ళు కాలిపోవడం అంటే లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తడి గుడ్డతో శరీరాన్ని తుడిచి చల్లని ప్రదేశంలో ఉంచాలని తెలిపారు. పరిస్థితి తీవ్రంగా ఉంటే వెంటనే రోగిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని ఎంపీడీవో డి. గోపికృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పిల్లలు బాగా చదువుకుని వారి భవిష్యత్తుకు వాళ్లే పునాది వేసుకోవాలి ఐసిడిఎస్ పార్వతి



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 21 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం ఆర్ కృష్ణాపురం అంగన్వాడి కేంద్రం నందు కిషోరీ వికాసం వేసవి సెలవుల కార్యక్రమాన్ని ఐసిడిఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు గురువారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో పార్వతి పాల్గొని కిశోర బాలికలకు బాల్య వివాహాల గురించి సైబర్ నేరాల గురించి మరియు వ్యక్తిగత పరిశుభ్రత రక్తహీనత గురించి బాలల హక్కుల గురించి అవగాహన కల్పించడం జరిగింది 18 సంవత్సరాలు నిండే వరకు వివాహము చేసుకోరాదని ఒకవేళ బాల్య వివాహం జరిగితే అబ్బాయి పైన పోక్సో కేసు నమోదు చేస్తారనిపోక్సో యాక్ట్ గురించి కూడా వివరించారు అలాగే పిల్లలు మంచిగా చదువుకొని వారి భవిష్యత్తుకు వాళ్లే పునాది వేసుకోవాలని చదువు పట్ల శ్రద్ధ వహించి సెల్ఫోన్లకి సినిమాలకి దూరంగా ఉండి తమ చదువును కొనసాగించాలని సెల్ఫోన్ చూడడం ద్వారా ఎక్కువగా దానికి ఆకర్షితులై ఏ పనిలో కూడా ముందుకు వెళ్లలేరని తద్వారా అన్ని విషయాలు వెనుకబడి ఉంటారన్నారు కాబట్టి మంచి ఆకుకూరలు ఐరన్ ఉన్న పదార్థాలు తినాలని ఆమె తెలిపారు. అంగనవాడి సిబ్బంది పాల్గొన్నారు.

# సారాయి ఖాకీలకు ఆదాయ వనరుగా బెల్ట్ షాపులు

### ప్రతి పల్లెలో బెల్టు దుకాణాలను నడిపిస్తున్న ప్రోహిబిషన్ పోలీసులు

### నెలనెల ప్రతి దుకాణానికి ఓ రేటు నిర్ణయించి వసూలు

### పాఠశాలు ఆలయాల వద్ద నడుస్తున్న మద్యం బెల్ట్ షాపులు

**కోవెలకుంట్ల మే 21 నంది పత్రిక** వేసవికాలంలో తాగడానికి నీరు దొరకడం లేదేమో కానీ ప్రతి గ్రామంలో మద్యం మాత్రం దొరుకుతుంది. కోయిలకుంట్ల ఎక్సైజ్ పరిధిలో ఉన్న సంజామల దొర్నిపాడు ఉయ్యాలవాడ కోవెలకుంట్ల మండలాల్లోని గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు సారాయి పోలీసులకు ఆదాయ వనరుగా మారి నెల నెల ఆదాయాన్ని ఆర్జించి పెట్టే ఆదాయ వనరుగా మారి ప్రొహిబిషన్ పోలీసులకు కల్పతరువుగా మారాయి. ప్రభుత్వము బెల్ట్ దుకాణాలను సీజ్ చేయండి నడిపించవద్దు నడిపే వారి మీద కేసులు పెట్టండి అని ఎంత మొత్తుకుంటున్నప్పటికీ ఇక్కడి పోలీసులకు మాత్రం వాటిని ఆదాయం వనరుగా మార్చుకొని వారి మాట చొప్పున దుకాణాలు నడిపిస్తున్నారు. ముఖ్యంగా సంజామల దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. దొర్లిపాడు మండలంలో ని క్రిష్టిపాడు గ్రామంలో పక్కనే పాఠశాల చర్చి ఉన్నప్పటికీ మద్యం మద్యాన్ని మూడు పూటలా నడిపిస్తున్న. ఎప్పుడంటే వేసవి సెలవులు ఉన్నాయి కాబట్టి పాఠశాలలో విద్యార్థులు లేరు. పాఠశాల కొనసాగుతున్నప్పుడు విద్యార్థులు ఉపాధ్యాయులు వారి తరగతి గదుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నయని కాపుతున్నారు. స్థానిక పోలీసులు కూడా తమకేమీ పట్టనట్టు షాప్ పై దృష్టి పెట్టడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సంజామల మండలంలోని కొన్ని గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. ప్రభుత్వము చీపు లిక్కర్ ధరను 99 రూపాయలుగా నిర్ణయిస్తే ఇక్కడ బెల్ట్ దుకాణాల్లో 150 రూపాయలు అమ్ముతున్నట్లు సమాచారం . బీరు మీద 70 రూపాయల దాకా వసూలు చేస్తూ అమ్ముకుంటున్నారు. ఇదంతా స్థానిక ఎక్సైజ్ పోలీసులకు, లాండ్ ఆర్డర్ పోలీస్ వారికి తెలియకపోలేదు తెలిసినప్పటికీ ఆ షాపుల నుండి నెల మామూలు వస్తుండడంతో వారి ఇష్టం వచ్చినట్టు విక్రయించుకునేందుకు వారిని వదిలి వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా యువత 18 నుండి 20 సంవత్సరాల లోపు ఉన్న యువత ఈ మత్తుకు అలవాటు పడి అరాచకాలు చేస్తున్నారు. క్రిష్టిపాడు గ్రామంలో మత్తుకు అలవాటుపడిన యువత మద్యానికి డబ్బులు లేకపోయేసరికి రైతులు పంటలు పండించుకునేందుకు వేసుకున్న విద్యుత్ మోటార్ల వైర్లను కట్ చేసుకుని వాటిని అమ్ముకొని మద్యానికి తగలబెట్టిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయం పై రైతులు స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. కోవెలకుంట్ల ఎక్సైజ్ పరిధిలోని మండలాలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా నడుస్తున్నప్పటికీ అవి వారికి నెల ఆదాయం తెచ్చే దుకాణాలు గా ఉండడంతో వారు వాటి జోలికి పోకుండా నెల మామూలు వసూలు చేసుకుంటూ తమ విధులు నిర్వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు

# అహంకార పాలనకు బలైన దళిత మేధావి డాక్టర్ సుధాకర్: ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి





### ప్యాపిలిలో డాక్టర్ సుధాకర్ జ్ఞాపకార్థం కొవ్వొత్తులతో ఘన నివాళి

### ప్రశ్నించినందుకే మానసిక రోగిగా ముద్ర వేశారు

### అరాచక పాలనకు ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు

### బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

**నంది పత్రిక -ప్యాపిలి** కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాల కోసం, కనీస రక్షణ పరికరాల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు అహంకార పాలన బలిగొన్న దళిత మేధావి, దివంగత డాక్టర్ సుధాకర్ మరణం రాష్ట్ర చరిత్రలోనే ఒక నల్లటి అధ్యాయమని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాపిలి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత మేధావి డాక్టర్ సుధాకర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల ముఖ్య అతిథిగా పాల్గొని, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ సుధాకర్ మరణం కేవలం ఒక వ్యక్తి మరణం కాదని, అది గత ప్రభుత్వ అహంకారానికి, అణచివేతకు ప్రతీక అని అన్నారు."కరోనా సమయంలో ప్రజల ఆరోగ్యం కోసం పోరాడిన ఒక ప్రభుత్వ వైద్యుడు 'మాస్కులు ఇవ్వండి.. రక్షణ పరికరాలు అందించండి' అని అడిగినందుకే ఆయనను తీవ్రంగా అవమానించారు. మానసిక రోగిగా ముద్ర వేసి, నడిరోడ్డుపై పోలీసులతో చేతులు కట్టించి అమానుషంగా ప్రవర్తించిన తీరు రాష్ట్ర ప్రజల హృదయాలను కలచివేసింది" అని గుర్తు చేశారు.

**రాజ్యాంగ హక్కులను కాలరాశారు..**

ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన గత ప్రభుత్వం, నిజం మాట్లాడిన వారిని అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. దళితులు, బడుగు బలహీన వర్గాలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం గత పాలకులకు అలవాటుగా మారిందని విమర్శించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను సైతం కాలరాస్తూ, దళిత సమాజం గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా మేధావులు, మానవ హక్కుల సంఘాలు స్పందించినా నాటి పాలకుల్లో కనీస మానవత్వం లోపించిందన్నారు.

**ప్రజలు సరైన బుద్ధి చెప్పారు..** అధికార మదంతో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన గత పాలకులకు ప్రజలు ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పారని, అలాంటి అరాచక పాలనను తిరస్కరించి ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

డాక్టర్ సుధాకర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమాజంలో ఇలాంటి దౌర్జన్యాలు పునరావృతం కాకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, కాజా పీర్, రాజా నారాయణమూర్తి, లక్ష్మీనారాయణ, సుదర్శన్, ఆర్ ఈ నాగరాజు,మధు, నేరేడుచర్ల వెంకటేష్,

రామకృష్ణ, కమతం భాస్కర్ రెడ్డి, వెంకట రాముడు,ఎస్కేవలి, చల్లావీర, వెంకటేష్, ఆర్సి మద్దిలేటి,బాల రంగన్న, బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ'..!

### యువత అసంతృప్తికి కొత్త రూపమా..?




**న్యూఢిల్లీ నంది పత్రిక మే 21-:** దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో ప్రస్తుతం "కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)" పేరుతో కొత్త ట్రెండ్ వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికలలో ఈ పేరుతో మీమ్స్, పోస్టులు, వీడియోలు భారీగా షేర్ అవుతున్నాయి. యువతలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలు, ప్రభుత్వ వ్యవస్థలపై అసంతృప్తి, రాజకీయాలపై వ్యంగ్యంగా స్పందించే క్రమంలో ఈ "కాక్రోచ్ జనతా పార్టీ" ట్రెండ్ ప్రారంభమైనట్లు సమాచారం. సోషల్ మీడియాలో వ్యంగ్య రాజకీయ ఉద్యమంగా మొదలైన ఈ ట్రెండ్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యల నేపథ్యంలో యువతను "కాక్రోచ్"లతో పోల్చారనే విమర్శలు రావడంతో దీనిపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. దీనిని వ్యంగ్యంగా తీసుకున్న కొంతమంది యువకులు "మేమే కాక్రోచ్‌లు" అంటూ పోస్టులు పెట్టడం ప్రారంభించారు. అనంతరం "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో సోషల్ మీడియా ఉద్యమం రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమానికి అభిజీత్ దిప్కే అనే సోషల్ మీడియా కార్యకర్త శ్రీకారం చుట్టినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే లక్షలాది మంది ఫాలోవర్లు ఈ పేజీలను అనుసరించడం విశేషం. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ట్రెండ్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. 'నిరుద్యోగం', 'పరీక్షల ఒత్తిడి', 'రాజకీయ వ్యవస్థపై అసంతృప్తి', 'యువత సమస్యలు' వంటి అంశాలను వ్యంగ్యంగా ప్రస్తావిస్తూ మీమ్స్, పోస్టులు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా జెన్-గ యువత ఈ ట్రెండ్‌ను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నట్లు సోషల్ మీడియా విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇది అధికారిక రాజకీయ పార్టీ కాదని, ప్రస్తుతం సోషల్ మీడియాలో వ్యంగ్య ఉద్యమంగా మాత్రమే కొనసాగుతోందని తెలుస్తోంది. అయినప్పటికీ దేశ రాజకీయాలపై యువత అభిప్రాయాలను బలంగా వ్యక్తపరిచే వేదికగా ఇది మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 30న బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశం

**బనగానపల్లె మే 21 నంది పత్రిక** ఈనెల 30వ తారీఖున బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగరాజు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావలెనని ఆయన తెలిపారు.

# దక్షిణ కాశీ యాగంటి క్షేత్రాన్ని ప్రతి భారతీయుడు దర్శించాలి :

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు



**బనగానపల్లె, మే 21:నందిపత్రిక** మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన ప్రసిద్ధి గాంచిన పవిత్ర క్షేత్రం శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వేద పండితులచే ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అభిరుచి మధు మాట్లాడుతూ, దక్షిణ కాశీగా పేరుగాంచిన యాగంటి క్షేత్రం సహజ సిద్ధంగా ఏర్పడిన గుహలు, నిరంతరం పెరుగుతున్న బసవయ్య విగ్రహం, నిత్యం ప్రవహించే జలధారలతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోందని తెలిపారు. ఈ పవిత్ర క్షేత్రాన్ని ప్రతి భారతీయుడు జీవితంలో ఒక్కసారైనా దర్శించి, శ్రీ ఉమామహేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బచ్చు శరత్ చంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బెక్కెం నాగేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇన్నోవేటివ్ బెస్ట్ ప్రాక్టీసెస్‌తో శాఖలు ముందుకు రావాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, మే 21(నంది పత్రిక):-** జిల్లాలో గ్రామీణాభివృద్ధి, పరిశుభ్రత, మహిళా సాధికారత, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వినూత్న కార్యక్రమాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి శాఖ "బెస్ట్ ప్రాక్టీసెస్" రూపకల్పన చేసి అమలు చేయాలని సూచించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో "బెస్ట్ ప్రాక్టీసెస్"పై స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీఓ), ఆర్ అండ్ బీ, సహకార శాఖ, హౌసింగ్, డీఆర్‌డీఏ, ఆర్టీసీ, డ్వామా, పశుసంవర్ధక శాఖ తదితర విభాగాల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ పరిధిలో సృజనాత్మక ఆలోచనలతో ముందుకు వచ్చి గ్రామీణాభివృద్ధికి ఆదర్శంగా నిలిచే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా ప్రజలకు కనిపించే విధంగా, ఫలితాలు ఇచ్చే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఆర్ అండ్ బీ, సహకార శాఖ, డీఆర్‌డీఏ, ఆర్టీసీ శాఖలు ప్రదర్శించిన "బెస్ట్ ప్రాక్టీసెస్"లను మరింత మెరుగుపరచి, ప్రజలకు ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి, వినూత్న పద్ధతుల్లో సేవల అందింపుపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటూ, గ్రామీణ రహదారులను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు "స్వచ్ఛపదం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని డీపీఓను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలయ్యే ప్రతి వినూత్న కార్యక్రమం ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



# మన ఊరు మన జెండా'కు విశేష స్పందన: బీజేపీలో చేరిన యువత, కుటుంబాలు





**నందిపత్రిక –ప్యాపిలి** ప్యాపిలి మండలంలోని మామిళ్లపల్లి, బోయిన చెరువుపల్లి గ్రామాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "మన ఊరు మన జెండా" కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం స్ఫూర్తితో ఆయా గ్రామాల పెద్దలు, యువత, పలు కుటుంబాలు భారీ సంఖ్యలో బీజేపీలో చేరారు. ప్యాపిలి మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ అభిరుచి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రధాని మోదీ సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు: డాక్టర్ అభిరుచి మధుఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ అభిరుచి మధు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజలను బీజేపీ వైపు ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతను విశ్వసించి, రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేయాలని, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రముఖులు: చక్క మద్దిలేటి, మైల మహేంద్ర, ఓబులరెడ్డి, సాయి, మల్లికార్జున, సోమశేఖర్, నాగేశ్వరరావు, పెద్ద ఓబయ్య, సుంకన్న, రంగస్వామి, లక్ష్మిరెడ్డి, రామచంద్ర, నాగేష్ తదితర యువకులు పార్టీలో చేరారు.బోయిన చెరువుపల్లి గ్రామం: మల్లయ్య, వెంకటరాముడు,

రాజు, శ్రీనివాసులు, గాజుల వెంకటరాముడు తదితరులు తమ అనుచరులతో కలిసి సుమారు 10 కుటుంబాలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నాయి.కొత్తగా పార్టీలో చేరిన వారికి డాక్టర్ అభిరుచి మధు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**హాజరైన ముఖ్య నేతలు:**ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జ్ అంబటి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దుబండి కిరణ్, కిసాన్ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ తిమ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కేసీ మద్దిలేటి, బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ సొప్పాకుల, యువ మోర్చా ప్యాపిలి మండల అధ్యక్షుడు పీ. శివ కేశవ్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఘనస్వాగతం పలికిన మంత్రి జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఎమ్మెల్యేలు





**కడపబ్యూరో చీఫ్ మే 21 నంది పత్రిక** వైయస్సార్ కడప జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా కడప విమానాశ్రయమునకు గురువారం సాయంత్రం 6.35 గం.లకు చేరుకున్న రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్,రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం లభించింది జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,ప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధిమీనా,రాజం పేట సబ్ కలెక్టర్ భావన, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, డి సి సి బి బ్యాంక్ చైర్మన్ సూర్య నారాయణ,డి సి ఎం ఎస్ చైర్మన్ జయప్రకాష్,ఎ ఎఫ్ సి ఓ ఎఫ్ చైర్మన్ యాదగిరి రామ్ ప్రసాద్,షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్,ఆర్ డి ఓమురళీ,డి ఈ ఓ శంషుద్దీన్, సమగ్ర శిక్ష ఏపీసి అనురాధ, నాయకులు భూపేష్ రెడ్డి, హరిప్రసాద్,రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి,పుత్తా నరసింహా రెడ్డి, జగన్మోహన్ రాజు,బీటెక్ రవి,రితేష్ కుమార్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి, పుట్టాలక్ష్మీ రెడ్డి,మన్సూర్ అలీ ఖాన్,అమీర్ బాబు,ప్రజా ప్రతినిధులు,అభిమానులు తదితరులు ఘన స్వాగతం పలికారు.





# మేధావితనం ముసుగులో అసత్య ప్రచారం ఆపాలి

### జనసేనను అర్థం చేసుకోకుండా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహితం- శీలంశెట్టి లక్ష్మయ్య

**పోరుమామిళ్ల,మే 21 (నంది పత్రిక ):**ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన జనసేన నేత శీలంశెట్టి లక్ష్మయ్య "జగన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం జనసేనకు లేదు"జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా బద్వేలు తాలూకా పోరుమామిళ్ల మండలం శీలంశెట్టి లక్ష్మయ్య గారు లి మాట్లాడుతూ, రాజకీయ విశ్లేషకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందిన ప్రొఫెసర్ నాగేశ్వర్ గారు వాస్తవాలను వక్రీకరిస్తూ, ఒక ప్రత్యేక రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడటం బాధాకరమని తీవ్రంగా ఖండించారు. ప్రజలకు నిజాలను విశ్లేషించి చెప్పాల్సిన బాధ్యత ఉన్న వ్యక్తులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సృష్టించిన కథనాలను "ఇన్‌సైడ్ ఇన్ఫర్మేషన్" పేరుతో ప్రచారం చేయడం మేధావితనం కాదని స్పష్టం చేశారు.జనసేన పార్టీ రాజకీయాలు వ్యక్తిగత కక్షలు, ప్రతీకారాలు, అరెస్టుల చుట్టూ తిరిగేవి కావని, ప్రజా సమస్యలు రాష్ట్ర భవిష్యత్తు యువత ఉపాధి అభివృద్ధి వంటి అంశాలపై మాత్రమే తమ పార్టీ దృష్టి ఉంటుందని





తెలిపారు. "జగన్ రెడ్డిని అరెస్ట్ చేయించాలి, కేసులు పెట్టించాలి అని చెప్పడానికి మాకేమైనా పనీపాటా లేదా? అలాంటి చిల్లర రాజకీయాలు చేసే సంస్కృతి జనసేనది కాదు" అని శీలంశెట్టి లక్ష్మయ్య గారు ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాగే శ్రీ పవన్ కళ్యాణ్ గారి రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేస్తూ, "మా అధ్యక్షులు వ్యక్తిగతంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో కూడా ఎప్పుడూ ఎవరి ముందు తలవంచలేదు. కేంద్రం నుంచి సహాయం కావాలా అని అడిగినా, 'నా పోరాటం నేనే చేస్తాను' అని చెప్పిన ధైర్య నాయకుడు పవన్ కళ్యాణ్ గారు" అని పేర్కొన్నారు.జనసేన పార్టీ రాజకీయాల మూలం సిద్ధాంతాలు, ప్రజా ప్రయోజనాలు, పారదర్శకత అని, కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రతి అంశాన్ని కుట్ర కోణంలో చూపిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయి, బెంగళూరు తాడేపల్లి మధ్య రాజకీయ టూరిజం చేస్తున్న జగన్ రెడ్డి గురించి కేంద్ర హోంమంత్రి వరకు వెళ్లి మాట్లాడాల్సిన పరిస్థితి జనసేనకు లేదని స్పష్టం చేశారు."విదేశాలకు వెళ్లాలన్నా కోర్టుల అనుమతులు తీసుకోవాల్సిన స్థితిలో ఉన్న నాయకుడి రాజకీయ భవిష్యత్తు గురించి జనసేన ఆలోచించే అవసరం లేదు. ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును అంగీకరించలేక కొంతమంది మేధావుల ముసుగులో వైసీపీ వాదనలు వినిపిస్తున్నారు" అని శీలంశెట్టి లక్ష్మయ్య గారు అన్నారు.ప్రొఫెసర్ నాగేశ్వర్ కి నిజంగానే విశ్వసనీయ సమాచారం ఉంటే, ఆ సమాచారం ఎవరు ఇచ్చారో ప్రజలకు చెప్పాలని, లేకపోతే నిరాధార ప్రచారాలతో ఉన్న గౌరవాన్ని కోల్పోవద్దని సూచించారు. ప్రజల్లో విశ్వసనీయత సంపాదించడం కష్టం, కానీ రాజకీయ పక్షపాతంతో దానిని కోల్పోవడం చాలా సులభమని హెచ్చరించారు. చివరగా, జనసేన పార్టీ ఎప్పటికీ వ్యక్తులపై కాదు వ్యవస్థ మార్పు కోసం, ప్రజా సంక్షేమం కోసం, నిజాయితీ రాజకీయాల కోసం పనిచేస్తుందని, అలాంటి ఉద్యమాన్ని తప్పుడు ప్రచారాలతో బలహీనపరచలేరని శీలంశెట్టి లక్ష్మయ్య గారు స్పష్టం చేశారు.

## ఈ నెల 22న ఆచంట నియోజవర్గంలో రెండవ విడత "వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్" కార్యక్రమం..

### వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉదయం 8.00 గంటల నుంచి మ.11.00 గంట వరకు మాత్రమే .. ప్రజలు గ్రహించాలి.

### ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిలి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 21నంది పత్రిక**



"ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న ఆచంట బాలంవారిపాలెం పి4 భవనం నందు ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించడం జరుగుతుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" జిల్లాలో ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా మొట్టమొదటిగా ఆచంట నియోజకవర్గంలో మే 15న మొదటి విడత కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, ఈ నెల 22 శుక్రవారం రెండవ విడత పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని ఆచంట బాలంవారిపాలెం పి4 భవనం నందు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 11.00 గంటల వరకు వివిధ ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 7:30 గంటలకే బాలంవారిపాలెం పి4 భవనంకు విధిగా చేరుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# నేటి నుంచి (మే 22) జిల్లాలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్"

### ముమ్మరంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ జూన్ 20 వరకు అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఇంచార్జి కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం:బ్యూరో చీఫ్ మే 21,నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర" మహా యజ్ఞంలో భాగంగా జిల్లాలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మే 22 నుండి జూన్ 20, 2026 వరకు నాలుగు వారాల పాటు ముమ్మర పారిశుధ్య డ్రైవ్ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ డ్రైవ్‌ను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులతో నిర్వహించిన సమీక్షలో వివరాలను వెల్లడించారు.

**నాలుగు వారాల కార్యాచరణ ప్రణాళిక** స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26 ప్రమాణాల ఆధారంగా ఈ డ్రైవ్‌ను నాలుగు వారాల పాటు నిర్వహించనున్నారు.మొదటి వారం (మే 22 మే 28): గత స్వచ్ఛ సర్వేక్షన్‌లో గుర్తించిన రెడ్, ఎల్లో బ్లాక్ స్పాట్ల నిర్మూలన, ప్రధాన రహదారులు, జంక్షన్ల క్లీనింగ్, రోడ్ మార్కింగ్స్ మరియు కర్బ్ పెయింటింగ్స్.రెండవ వారం (మే 29 జూన్ 4): వర్షాకాలానికి ముందే వరద కాలువలు, నాలాల పూడికతీత మరియు ఇరుకైన సందుల లోతైన శుభ్రత. మూడవ వారం (జూన్ 5 జూన్ 11): నివాస, వాణిజ్య సముదాయాలలో 100% తడి-పొడి చెత్త వర్గీకరణ. బల్క్ వేస్ట్ ఉత్పత్తిదారులచే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నియమాల అమలు.

నాల్గవ వారం (జూన్ 12 జూన్ 20): అన్ని పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్ల సంపూర్ణ శానిటైజేషన్, చెత్త వేసే సమస్యాత్మక ప్రాంతాల పూర్తి నిర్మూలన.

**కఠిన చర్యలు – పారదర్శకత:**నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లు, మార్కెట్లు, కల్యాణ మండపాలపై కఠిన చర్యలు ఉంటాయి. అవసరమైతే నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేసే అధికారాలు కలెక్టర్లకు ఉన్నాయి.జియో-ట్యాగింగ్: 'జియోస్టాట్ టీమ్' అనే థర్డ్-పార్టీ ఏజెన్సీ ద్వారా పనులకు ముందు, తర్వాత ఫోటోలను జియో-ట్యాగ్ చేసి రోజువారీ నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు.డ్యాష్‌బోర్డ్ పరిశీలన: మున్సిపల్ కమిషనర్లు వార్డుల వారీగా మైక్రో ప్లాన్స్ సిద్ధం చేసి, ప్రతి రోజు రాత్రి 8 గంటల లోపు వివరాలను ఎమ్ఐఎస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి.

**గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యం**: ఒకే రాష్ట్రంలో అత్యధిక మున్సిపాలిటీల్లో ఏకకాలంలో నిర్వహించిన అతిపెద్ద క్లీన్‌లీనెస్ డ్రైవ్‌గా దీనిని నిలిపి, "గిన్నిస్ వరల్డ్ రికార్డ్" సాధించేందుకు



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, జియోస్టాట్ బృందాలు డాక్యుమెంటేషన్ సిద్ధం చేస్తున్నాయి. ఈ రికార్డులో పశ్చిమగోదావరి జిల్లా ముందుండాలని ఇంచార్జి కలెక్టర్ పిలుపునిచ్చారు ఈ డ్రైవ్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన ఉత్తమ మున్సిపాలిటీలకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు ఉంటాయని, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు మరియు ప్రజలందరూ భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు

# జిల్లా కలెక్టర్ చొరవతో 22ఏ భూములకు మోక్షం

### దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 22ఊ సమస్యకు పరిష్కరం చకా చకా 22ఏ నిషేధిత జాబితా భూములకు విముక్తి ఏలూరు జిల్లాలో ఒక్క రోజులోనే 142 ఏకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగింపు... భూమి యజమానులకు ఊరట

**ఏలూరుబ్యూరో చీఫ్ , మే, 21 నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ ప్రజా ప్రభుత్వం 22-ఏ భూ సమస్యలను పరిష్కరించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు బదిలీ చేసింది. దీనివల్ల ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలకు నోచుకోని వేలాది ఎకరాల పట్టా భూములు నిషేధిత జాబితా నుంచి విముక్తి పొందుతున్నాయి.. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏలూరు జిల్లాలోని కలిదిండి



మండలం కలిదిండి గ్రామంలోని సర్వే నంబర్లు 1051, 1083, మరియు 1084 లలోని కొన్ని భూములను, రిజిస్ట్రేషన్ చట్టం, 1908 లోని సెక్షన్ 22-ఊ(1)(వ) కింద నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ రికార్డులలో "అనాధీనం"గా వర్గీకరించబడిన ఈ భూములను 1954కు ముందు కేటాయించారని, మరియు అనేక దశాబ్దాలుగా చట్టబద్ధమైన వారసులు, రిజిస్టర్డ్ పత్రాల ద్వారా నిరంతర చట్టబద్ధమైన లావాదేవీలు జరిగాయని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి గుర్తించి భూపరిపాలన కమిషనర్ వారికి ప్రతిపాదించిన మేరకు వారు కనుగొన్న తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.నిషేధిత జాబితా నుండి తొలగించడానికి గతంలో జారీ చేసిన జీవోలు మరియు సర్క్యులర్ మెమోలలో నిర్దేశించిన షరతులకు ఈ భూములు అనుగుణంగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. జిల్లా రిజిస్ట్రార్ మరియు సబ్-రిజిస్ట్రార్ సహా అధికారులకు రికార్డులను తదనుగుణంగా నవీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న సానుకూన చర్యలతో భూమి యజమానులు తమ సంతోషాన్ని, హర్షాన్ని వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి లకు తమ కృత్ఞతలు తెలిపారు.

## ఇరాన్‌తో తలగొక్కున్న అమెరికా

ఇరాన్ పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లిందని యుఎస్ కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ఎస్ ) ఒక నివేదికలో తెలిపింది.ఈ నష్టాల కారణంగా పెంటగాన్ అంచనా వేసిన సైనిక కార్యాచరణ వ్యయం భారీగా పెరిగి 29 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ.2.4 లక్షల కోట్లు చేరినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికాకు చెందిన సుమారు 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవ్వడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని ఈ నివేదిక పేర్కొంది. వర్గీకరణ, కొనసాగుతున్న పోరాట కార్యకలాపాలు, బాధ్యతను గుర్తించడం వంటి పలు కారణాల వల్ల దెబ్బతిన్న లేదా ధ్వంసమైన విమానాల సంఖ్య సవరణకు లోబడి ఉండవచ్చని సిఆర్ ఎస్ తెలిపింది. ధ్వంసమైన లేదా దెబ్బతిన్న వాయుసేన ఆస్తులలో అత్యధికంగా 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఒక ఎంక్యూ-4సి ట్రిటాన్ డ్రోన్ ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఎఫ్-15ఇ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్లు, ఒక అత్యాధునిక ఎఫ్-35ఎ లైట్నింగ్ ఎఎ స్టీల్త్ ఫైటర్ జెట్, ఒక ఎ-10 థండర్‌బోల్ట్ గ్రౌండ్-అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. శత్రువుల దాడిలో ఏడు కెసి-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానాలు, ఒక ఇ-3 సెంట్రీ అవాక్స్ (ఎడబ్ల్యుఎసిఎస్ ), నిఘా విమానం, రెండు ప్రత్యేక ఆపరేషన్ల విమానాలు, ఒక హెచ్‌హెచ్-60 డబ్ల్యూ రెస్క్యూ హెలికాప్టర్ దెబ్బతిన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. యుఎస్ కాంగ్రెస్, కమిటీలకు విధానపరమైన, చట్టపరమైన విశ్లేషణను అందించే సిఆర్ ఎస్, రక్షణ శాఖ, యుఎస్ సెంట్రల్ కమాండ్ వార్తా నివేదికలు, ప్రకటనలను పరిశీలించడం ద్వారా ఈ నష్టాలను అంచనా వేసింది. అమెరికా రక్షణ శాఖ ఇప్పటివరకు అధికారికంగా నష్టాల పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, దెబ్బతిన్న యుద్ధ పరికరాల మరమ్మతులు, పునరుద్ధరణ ఖర్చులు ఊహించిన దానికంటే విపరీతంగా పెరిగాయి.

# జిల్లా ప్రజలు, అధికారులు వడగాల్పుల పై అప్రమతంగా ఉండాలి

### చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

### ఇంచార్జ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరంబ్యూరో చీఫ్ : మే 21,నంది పత్రిక** రానున్న వారం రోజుల పాటు వడగాల్పులు వీచి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమతంగా ఉండాలని ఇంచార్జ్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. వేసవి తీవ్రతపై ఇంచార్జ్ కలెక్టర్ ఆర్డీవోలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేసారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాగునీరు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే అవసరాల మేరకు వాటర్ ట్యాంకుల ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలన్నారు. బస్టాండ్, మార్కెట్ ప్రదేశాలు, ముఖ్య కూడల్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి వడగాల్పులు పై తీసుకోవలసిన జాగ్రత్తలపై పట్టణాలలో ముఖ్య ప్రదేశాలలో హోర్డింగులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, రైల్వే గేట్ల వద్ద మరియు ముఖ్యమైన ప్రదేశాలలో నీడ కల్పించేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో, పీహెచ్సీలలో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుచున్నందున పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు స్టాక్ పెట్టుకోవాలన్నారు. ప్రధానంగా బస్టాండ్స్, మార్కెట్ కూడళ్ళలో, ఆసుపత్రులు, పాఠశాలల్లో, వృద్ధులకు , పారిశుధ్య కార్మికులు పనిచేసే చోట, తోపుడుబళ్ళపై విక్రయించేవారికి, గృహం లేక బయట నివసిస్తున్న వారికీ త్రాగునీరు, ఓ.ఆర్.ఎస్ వంటివి సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. అన్ని సచివాలయాల్లో తాగు నీరు, అత్యవసర మందులు, ఓ.ఆర్.ఎస్ వంటివి సిద్ధంగా ఉంచాలన్నారు. పక్షులు, జంతువుల కోసం పశు సంవర్ధక శాఖ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా చూడాలని ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులకు సూచించారు. పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతి అధికారికి ఆదేశించారు. అన్ని సచివాలయాలలో స్థానిక ఆసుపత్రుల మెడికల్ అధికారుల సెల్ నెంబర్లు



అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలనీ, ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆయన అధికారులను కోరారు. చలివేంద్రాలు వద్ద వినియోగించే కుండలను ఉదయం, సాయంత్రం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. అలాగే గ్లాస్ తో ముంచుకుని తాగకుండా, ట్యాప్ వున్న కుండలను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, డిపిఓ వై.దోసిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లగణనను వెంటనే పూర్తిచేయాలి

### తీవ్ర వేడిగాలులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

### మాదేపల్లి స్వర్ణ గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి





**ఏలూరుబ్యూరో చీఫ్ , మే, 21 నంది పత్రిక :** ఏలూరు రురల్ మండలం వెంటకపురం పంచాయతీలోని మాదేపల్లి లో జరుగుతున్న జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్లగణన ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాదేపల్లిలోని వెంకటాపురం-1 గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనికే చేసి సిబ్బందితో ఇండ్లగణన, వేడిగాలుల తీవ్రత, కౌశలంలో యువత గుర్తింపు, తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇండ్లగణన కార్యక్రమం అత్యంత ప్రధానమైనదన్నారు. ఇండ్లగణన ను సచివాలయ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తీవ్ర వేడిగాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా వేడిగాలుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో అవసరమైన మేర చలివేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. వేడిగాలుల ప్రభావాన్ని అన్ని గ్రామాలలోని ప్రజలకు టాంటాం ద్వారా తెలియజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామంలోని వారికి అందరికీ తెలియజేయాలన్నారు. అత్యవసర పరిస్థితిలో వైద్య సహాయం నిమిత్తం దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించేలా సిబ్బంది పనిచేయాలన్నారు. కౌశలం కార్యక్రమంలో అర్హత కలిగిన యువతకు శిక్షణ అందించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు ఏలూరు నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ డి. శ్రీనివాస్, తహసీల్దార్ కె. గాయత్రీదేవి, స్వర్ణ గ్రామ,వార్డ్ సచివాలయాలు జిల్లా సమన్వయాధికారి జి. వెంకటనాయుడు,

# బక్రీద్ సందర్భంగా ఆవులు, దూడలు, చూడి పశువుల వధ నిషేధం



### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు

### ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరంబ్యూరో చీఫ్ మే 21,నంది పత్రిక** బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న గోవధ నిషేధం మరియు జంతు సంరక్షణ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆవులు, లేగదూడలు, చూడి పశువులను వధించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం ఇంచార్జ్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో పోలీస్, రెవిన్యూ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలిసి బక్రీద్ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అమల్లో ఉన్న "ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధం మరియు జంతు సంరక్షణ చట్టం1977" ప్రకారం ఆవులు, దూడలు మరియు కొన్ని వర్గాల పశువులను వధించడం నిషేధించబడిందన్నారు. మే 28న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడా నిషేధిత జంతువుల వధ జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్, రెవిన్యూ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్, రవాణా, మార్కెటింగ్ శాఖల సిబ్బందితో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి జిల్లాలో నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా నిషేధిత జంతువుల వధ లేదా అక్రమ రవాణా గుర్తించిన వెంటనే అడ్డుకుని కేసులు నమోదు చేయాలని సూచించారు. జంతువులకు కూడా జీవించే హక్కు ఉందని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. జంతు సంరక్షణ చట్టం1960 ప్రకారం గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు వంటి జంతువులను మాత్రమే చట్టబద్ధంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే వన్యప్రాణి సంరక్షణ చట్టం1972 ప్రకారం అడవి జంతువులను వేటాడడం లేదా వధించడం నేరమన్నారు. పశువుల రవాణా విషయంలో కూడా నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. సెంట్రల్ మోటార్ వెహికల్స్ యాక్ట్1989 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం రవాణా శాఖ అనుమతి పొందిన వాహనాల్లో మాత్రమే పశువులను తరలించాల్సి ఉంటుందని తెలిపారు. వాహనాల్లో తగిన స్థలం, గాలి, వెలుతురు, ఆహారం మరియు ప్రాథమిక చికిత్స వసతులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా చట్టపరంగా అనుమతించబడిన జంతువులను మాత్రమే వినియోగించాలని, ప్రజలు శాంతి భద్రతలకు భంగం కలగకుండా సహకరించాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈవో పి.జగదాంబ, జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కోటిలింగరాజు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జవ్వార్ హుస్సేన్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.జయకర్ జాన్సన్, డీపీఆర్ఓ టి.నాగేశ్వరరావు, డిఇఓ ఇ.నారాయణ, సీటీఓ డి.శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడి కె. సునీల్, ఎస్పీసీఏ సభ్యుడు టి.రామకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.



# సెప్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వదిలితే ఉపేక్షించేది లేదు

### సెప్టిక్ వాహనాల రిజిస్ట్రేషన్, మ్యాపింగ్ చేసి పర్యవేక్షణకు ఆదేశాలు

### మంజూరైన ఎస్‌టీపీలు, ఎఫ్ఎస్‌టీపీలు కోసం భూసేకరణ వేగవంతం చేయాలి

### ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే అంశాలపై అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

### ల్జజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 21నంది పత్రిక** హైదరాబాద్‌లో శిక్షణలో ఉన్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంచార్జ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి నిర్వహించిన ఈ సమీక్షలో ఎస్‌టీపీలు, ఎఫ్ఎస్‌టీపీలు కోసం భూసేకరణ, గ్రంథాలయ పన్ను వసూళ్లు, పట్టణ పారిశుద్ధ్యం, అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ స్పందన, ఆపరేషన్ క్లీన్ స్వీప్ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సెప్టిక్ ట్యాంకర్ల ద్వారా సేకరించిన మలవిసర్జనలను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్న ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని సెప్టిక్ ట్యాంకర్ వాహనాలను తక్షణం రిజిస్టర్ చేయించి, వాటి మ్యాపింగ్ పూర్తి చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన ఎస్‌టీపీలు (ావఖ్రువ ుతీమ్‌ఎవత్ ాశ్రీఖ్‌తం), ఎఫ్ఎస్‌టీపీలు (ఖీవఖ్రశ్రీ ాశ్రీబఎస్రవ ుతీమ్‌ఎవత్ ాశ్రీఖ్‌తం) కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నరసాపురంలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ట్యాంకర్ల ద్వారా సేకరించిన మలవిసర్జనలను అనుమతిలేని ప్రదేశాల్లో పారబోస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సూచించారు.పాలకొల్లు, తణుకు, భీమవరం పట్టణాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు తయారీకి అనువైన చెత్త శుద్ధి ప్లాంట్లను అందుబాటులో ఉన్న స్థలాల్లో తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి అనంతరం మిగిలే కఠిన వ్యర్థాల నిర్వహణ కోసం ల్యాండ్‌ఫిల్ లైనింగ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రంథాలయ పన్ను వసూళ్లలో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వసూలైన మొత్తాల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి అందజేయాలని ఆదేశించారు.అన్నా క్యాంటీన్ల పనితీరుపై కూడా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని క్యాంటీన్లు ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సర్వేలో తక్కువ ర్యాంకులు సాధించడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలతో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పరిశీలిస్తూ, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రజాభిప్రాయ సర్వేలో మెరుగైన ర్యాంకులు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో జిల్లా 12వ స్థానానికి పడిపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దుకాణాల ముందు చెత్త కనిపించినా, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నా సంబంధిత వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. "చెత్త వేస్తూ ఉంటే శుభ్రం చేస్తూనే ఉంటారా? సమస్యను మూలంలోనే అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి" అని అధికారులను హెచ్చరించారు ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు...



# జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా నైపుణ్యాభివృద్ధి కోర్సులు రూపొందించాలి



### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరంబ్యూరో చీఫ్ : మే 21,నంది పత్రిక** జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రూపొందించే శిక్షణా కోర్సులు జిల్లాలోని యువతీ యువకులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఉండాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం నైపుణ్య, ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక రూపకల్పన మరియు ప్రభుత్వానికి సమర్పణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సూచనల మేరకు పశ్చిమ గోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను సమీక్షించి, జిల్లాలో ఉపాధి అవకాశాలకు అనుగుణంగా ప్రతిపాదిత ఉద్యోగ పాత్రల డిమాండ్‌ను ఖరారు చేయడం, పరిశ్రమల అవసరాల విశ్లేషణ చేపట్టడం, శిక్షణా కార్యక్రమాలను సమర్థవంతంగా రూపొందించడం వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణలు అందించేందుకు అవసరమైన కోర్సులను రూపొందించాలని డిఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సూచించారు. మహిళల అభివృద్ధికి దోహదపడే విధంగా మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. మత్స్యశాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ శాఖ ద్వారా సూచించిన వివిధ కోర్సులను పరిగణనలోకి తీసుకుని, ఆయా కోర్సులకు అనుగుణంగా ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతను గుర్తించాలని ఆదేశించారు. సముద్ర, మత్స్య ఆధారిత ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా శిక్షణా కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను ప్రస్తావిస్తూ, రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక మరియు ఆధ్యాత్మిక రంగాలకు సంబంధించిన వృత్తి నైపుణ్య కోర్సులను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు, స్థానిక ఉపాధి అవకాశాలను మ్యాపింగ్ చేసి, టూరిజం గైడింగ్ వంటి రంగాల్లో యువతకు శిక్షణ కల్పించాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఐటీఐలు, ఇతర నైపుణ్యాభివృద్ధి కేంద్రాలలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను యువతీ యువకులు పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి నిరుద్యోగ యువకుడు, యువతి నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాల వైపు ముందడుగు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా.పి.లోకమాన్, జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతి రావు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మన స్వదేశీయంలో విదేశీయానిదే విజయమా?

సప్తపదులు, సప్తనదులు, సప్తస్వరాలు, సప్తఋషులు.. ఇట్లా ఏడు అంకె చుట్టూ అనేక జీవిత, ఖగోళ, భౌగోళిక అంశాలను ముడిపెట్టటం మనకు కొత్తకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధంతో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కోటానికి ప్రజలు త్యాగాలూ, పొదుపులూ చేయాలంటూ ప్రధాని మోదీ కూడా సప్తసూత్రాలను ప్రకటించారు. దేన్నైనా సప్తసూత్రాలుగా చెబితే ప్రజలను బాగా ఆకర్షిస్తుందనే మోదీ భావించి ఉండొచ్చు. సప్తానికి మన సంస్కృతి చాలా ప్రాధాన్యతను ఇచ్చింది. అందులో సందేహం ఏమీలేదు. ఇక సంస్కృతిలో బాగా పాతుకుపోయిన భావాలను ఉపయోగించుకుని రాజకీయంగా ప్రజలను సమాయత్తం చేయటం అన్ని దేశాల్లోనూ ఉంది. ఇటీవల కాలంలో ఈ విషయంలో మోదీ ప్రదర్శించే ప్రతిభ అసాధారణమైంది! ఇందులో ఆయన దరిదాపులకు వచ్చే నేతలను ప్రపంచం మొత్తంలోనే వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఆచారాలు, నమ్మకాలు, ఇష్టాయిష్టాల్లో ఎంతో వైవిధ్యం ఉన్న దేశంలో మంచికైనా చెడుకైనా సంస్కృతిని ఆధారం చేసుకుని జనాన్ని రాజకీయ లక్ష్యాలవైపు ఆకర్షించటం అంత సులువుకాదు. రాజకీయ లక్ష్యాలు సంకుచితమైనవైతే సంస్కృతి కూడా చివరికి అదే దారిలోకి వెళుతుంది. దీనికి ఏ దేశమూ మినహాయింపుకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు 40 రోజులపాటు భీకరంగా దాడులు చేశాయి. వీటిని అసాధారణలో రీతిలో తట్టుకుంటూ ఇరాన్ ప్రతిదాడులనూ చేసింది. గల్ఫ్‌దేశాల్లోని అమెరికా సైనికస్థావరాలు ఆ ప్రతిదాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. అమెరికాకు ఇంతకు మించిన తలవంపు ఇటీవల కాలంలో మరొకటి లేదు. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధం చేయటంతో చమురు, సహజవాయువు, ఎరువుల రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రపంచ సరఫరా వ్యవస్థే గాడితప్పింది. అయినా అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకూ యుద్ధప్రభావం గురించి విపులంగా ప్రధాని మోదీ ఎప్పుడూ మాట్లాడలేదు. అంతకు ముందుకూడా అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని బహిరంగంగా ప్రకటించనూ లేదు. యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయిపోతోందనీ దాన్ని దృష్టిలో పెట్టుకునైనా యుద్ధం ఆపాలనీ కోరలేదు. కొండెక్కిన చమురు ధరలతోనూ ఇతరత్రానూ దిగుబడుల భారం పెరిగి విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా హరించుకుపోయే ప్రమాదం ముంచుకొస్తూ ఉండటంతో త్యాగాలు చేయాలనీ, పొదుపులు పాటించాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు. సప్తసూత్రాల్లో స్వదేశీ వస్తువులను కొనాలనే పిలుపు కూడా ప్రధానంగా ఉంది. గ్లోబలైజేషన్ తర్వాత ఈ స్వదేశీ నినాదం ఎంతమేరకు ఆచరణాత్మకమో పరిశీలిస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఏదీ విదేశీ, ఏదీ స్వదేశీ అన్న గీతలు గీయటం కూడా కష్టమైపోతోంది. మేడిన్ ఇండియా వస్తువుల లోగుట్టుని లోతుగా చూస్తే అందులోని విదేశీయత రట్టు అవుతుంది. నూటికినూరుపాళ్లూ స్వదేశీ కంపెనీ ఉత్పత్తులనే కొనాలనుకుంటే మన ఎంపిక చాలా పరిమితం అయిపోతుంది. విదేశీ మారకద్రవ్యం పొదుపు లక్ష్యంగా ఇక్కడ తయారయ్యే వస్తువులను కొనుగోలు చేయించటమే మోదీ పిలుపు పరమార్థమైతే మనం పెద్దగా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. 90శాతం మంది ప్రజలకు ఇక్కడే దొరికే వస్తువులే బోలెడు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అచ్చంగా ఏవి స్వదేశీ అన్నవే సమస్య! మనం రోజూ వాడే వస్తువులనూ, ఉపకరణాలనూ స్వదేశీ కంపెనీలే తయారుచేయటం లేదు. అవి ఇక్కడ ఉత్పత్తి అవుతున్నా వాటిని స్వదేశీయతకూ, స్వావలంబనకూ ఉదాహరణలుగా చెప్పుకోలేం. అవన్నీ ప్రధానంగా విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయి. సర్ఫ్ ఎక్సెల్, లక్స్, లైఫ్‌బాయ్, క్లినిక్ ప్లస్, డవ్, క్లోజప్, బ్రూక్‌బాండ్ రెడ్‌లేబుల్, బ్రూ, హార్లిక్స్, బూస్ట్, లేస్, ట్రోపికానా, జిలెట్, హెడ్ అండ్ షోల్డర్స్, కాల్గేట్, పెప్సొడెంట్, మ్యాగీ, నెస్‌కేఫ్, కిట్‌క్యాట్, సెరెలాక్, కెల్లాగ్ కోర్న్‌ఫ్లేక్స్, కోకకోలా, థమ్స్‌అప్, పెప్సీ, కుర్కురే, వ్యాసలీన్, లాక్మే, పాండ్స్, రిన్, పియర్స్ లాంటి ఉత్పత్తులన్నీ విదేశీ బహుళజాతి సంస్థలకు అనుబంధంగా ఉన్న కంపెనీల నుంచే వస్తున్నాయి. మనం వినియోగించే వస్తువులన్నీ లెక్కలోకి తీసుకుంటే ఈ జాబితా ఇంకా పెరుగుతుంది. ఈ కంపెనీల్లో భారతీయుల పెట్టుబడులు లేవా? అంటే ఉన్నాయి. అవన్నీ చాలా వరకూ 45శాతం లోపే ఉంటాయి. కానీ విదేశాల్లోని మూల కంపెనీలకు సంబంధించిన పెట్టుబడులే అధికంగా ఉంటాయి. కీలక నిర్ణయాలన్నిటినీ అవే శాసిస్తాయి. ఐటీసీ, అమూల్, డాబర్, మ్యారికో, బ్రిటానికా, గోద్రేజ్, పార్లే లాంటి భారత కంపెనీల ఉత్పత్తులు కూడా మార్కెట్‌లో రాణిస్తున్నాయి. కానీ వీటి ఉత్పత్తుల వాటా మార్కెట్‌లో 4248శాతం మధ్యలోనే ఉంటుంది. వీటితో పోల్చితే బహుళజాతి సంస్థల అనుబంధ కంపెనీల ఉత్పత్తుల వాటా ఎక్కువ. అది 5258శాతం ఉంటుంది. నెలనెలా వాడుకునే ఈ ఉత్పత్తుల్లో భారత యాజమాన్యంలోని కంపెనీల వాటా 45శాతం ఉండటం ఊరటగా అనిపించొచ్చు. కంప్యూటర్లు, వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, మొబైల్స్ దగ్గరకు వెళితే స్వదేశీ కంపెనీలు ఎక్కడో ఉంటున్నాయి. ముందుగా మొబైల్ ఫోన్ల సంగతి చూద్దాం. భారతీయుల యాజమాన్యంలో ఉన్న మొబైల్ కంపెనీలు లావా, మైక్రోమాక్స్, కార్బన్ తయారుచేసే మొబైళ్ల మార్కెట్ వాటా 23శాతం మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మిగతావన్నీ విదేశీ కంపెనీల మొబైళ్లే. యాపిల్ ఫోన్లను ఇక్కడ తయారుచేసే కంపెనీల్లో కూడా ఫాక్స్‌కాన్‌దే (తైవాన్) ఆధిపత్యం. మన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ కూడా 35 శాతం వరకూ యాపిల్ ఫోన్లను తయారుచేస్తోంది. విస్ట్రన్, పెగట్రాన్ లాంటి తైవాన్ కంపెనీలో షేర్లు కొనుగోలుచేసి యాజమాన్యాన్ని పొందటంతో టాటా ఎలక్ట్రానిక్స్ ఆ పనిని సులభంగా చేయగలుగుతోంది. ఇక రిఫ్రిజిరేటర్ల పరిస్థితి చూసినా మనకు ఈ దృశ్యమే కనపడుతుంది. పది ప్రధాన బ్రాండ్లను తీసుకుంటే అందులో గోద్రేజ్, వీడియోకోన్‌లు మాత్రమే స్వదేశీ యాజమాన్యం కింద ఉన్నాయి. మిగతావన్నీ విదేశీ యాజమాన్యాలకు చెందినవే. వాటి మార్కెట్ వాటా 8090శాతం మధ్యలో ఉంటుంది. కార్ల వ్యవహారాన్ని చూసినా పరిస్థితిలో మార్పు కొద్దిగానే కనపడుతోంది. భారతీయ కంపెనీల కార్ల మార్కెట్ వాటా ఇప్పటికీ 1525 శాతం మధ్యలోనే ఉంది. 12 ప్రధాన కార్ల కంపెనీల్లో టాటామోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా మాత్రమే భారత యాజమాన్యానికి చెందినవి. విదేశీ కార్ల కంపెనీల మార్కెట్ వాటా 7585శాతం మధ్యలో ఉంటుంది. కంప్యూటర్ల తయారీలో స్వదేశీ కంపెనీల వాటా 310శాతం మధ్యలో ఉంటే విదేశీ కంపెనీలు 9097శాతం వాటాతో మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఒకప్పుడు హెచ్‌సీఎల్, జెనిత్, విప్రో కంప్యూటర్లు భారతీయ బ్రాండ్లుగా మార్కెట్‌లో బాగానే ఉండేవి. కాలక్రమంలో విదేశీ కంపెనీల ధాటికి తట్టుకోలేకపోయాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా హెచ్‌పీ, డెల్, లెనోవో, యాపిల్, ఏసర్, ఏసస్ కంప్యూటర్లే మనకు కనపడతాయి. ఒకకోణం నుంచి చూస్తే ఔషధాల తయారీలో భారతీయ కంపెనీల ఆధిపత్యం కనపడుతుంది. 6575శాతం మార్కెట్ వాటాతో అగ్రభాగాన ఉన్నాయి. బహుళజాతి కంపెనీలు మిగతా వాటాను పంచుకుంటున్నాయి. జనరిక్ డ్రగ్స్‌ను, వాక్సిన్లను పెద్దఎత్తున తయారుచేయగలగటంలో భారతీయ కంపెనీలు అసాధారణ సామర్థ్యాన్ని సంపాదించాయి. ఇది దేశ అవసరాలను పెద్దఎత్తున తీర్చటంతో పాటు విదేశాలకూ చౌకగా వాటిని ఎగుమతి చేయటానికి బాగా తోడ్పడింది. అయితే మౌలిక పరిశోధనలతో, కొత్త ఫార్ములాల ఆవిష్కరణలతో, సంపూర్ణ పేటెంట్ హక్కులతో తయారుచేసే మందుల్లో భారతీయ కంపెనీలు బాగా వెనుకబడే ఉన్నాయి. కొలెస్ట్రాల్, డయాబిటీస్, రక్తపోటుకు డాక్టర్లు రాసే మందులనూ, వివిధ ఇన్ఫెక్షన్లను తగ్గించటానికి వాడే యాంటీబయాటిక్స్‌నూ పరిశీలిస్తే మనకు పరిస్థితి అర్థమవుతుంది. వీటిల్లో దాదాపుగా అన్నీ వేరే దేశాల్లో అభివృద్ధి అయినవే ఉన్నాయి. అత్యవసరంగా మనం వాడే 100 మందులను తీసుకుంటే అందులో 15 వరకూ మాత్రమే మనం సొంత పరిశోధనతో ఇక్కడ అభివృద్ధి చేసుకున్నాం. ఈ పరిణామాల కోణంలో మన ఆర్థిక వ్యవస్థను స్వదేశీ, విదేశీ అని గిరిగీసి చూసుకుంటే పరిస్థితి అంతా ఆశాజనకంగానే కనిపించదు. చాలా కీలకరంగాల్లో మన అడుగులు.. చేరాల్సిన గమ్యంతో పోల్చితే తక్కువే పడ్డాయి. సంక్షోభాలు మీద పడ్డప్పుడు మాత్రమే మన పాలకులకు అవి గుర్తుకొస్తాయి. 1990లో విదేశీ మారకద్రవ్యం చెల్లింపుల్లో సంక్షోభం ఏర్పడినప్పుడు దాన్నుంచి గట్టెక్కటానికి ఆర్థికసంస్కరణలు తీసుకొచ్చారు. అలాగే కోవిడ్ విజృంభించినప్పుడు మాస్కులూ, ఇతర వైద్య ఉపకరణాలూ దొరకని పరిస్థితుల్లో మేకిన్ ఇండియా విధానానికి పదునుపెట్టారు. ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధమూ అండగా ఉంటుందనుకున్న అమెరికా తెచ్చిపెట్టిన అనేక చిక్కులతో స్వదేశీ వస్తు వినియోగానికి పిలుపునివ్వటం అవసరమైంది. విదేశీ కంపెనీలు తమ సొంత పరిశోధనలతో, తమ సొంత డిజైన్లతో, తమ సొంత సాంకేతిక పరిజ్ఞానంతో భారత్‌లో ఉత్పత్తులు తయారుచేయటం వల్ల మనకు స్వావలంబన రాదు. ఎంతగా గ్లోబలైజేషన్ విస్తృతమైనా కీలక రంగాల్లో స్వావలంబన లేకపోతే ఆర్థిక వ్యవస్థ పటిష్ఠపునాదులపై ఉన్నట్లుగా భావించలేం. మేకిన్ ఇండియా ఉత్పత్తులన్నీ నిజమైన భారతీయ బ్రాండ్లుగా ప్రపంచం గుర్తించాలంటే మన సొంత సాంకేతిక పరిజ్ఞానంతో, మన డిజైన్లతో, మన పరిశోధనల పునాదులపై అవి తయారుకావాలి. అందుకు ఎంతో హేతుబద్ధమైన దృష్టీ, వైజ్ఞానిక దృక్పథమూ ఉండాలి. మతం, కులాల పేరుతో ప్రజలను ఊగ్రూతలూగించటం తేలిక. సొంత సంస్కృతిలోనే గొప్పవైనవన్నీ ఉన్నాయనే భ్రమలో బతకటమూ తేలికే. మనవైన మౌలిక ఆవిష్కరణలూ, వినూత్న వస్తునిర్మాణ కౌశల్యాలే కష్టమైనవి. ఒకనాటి భారతీయ చేనేత పరిశ్రమ దాన్ని సాధించింది. అందుకే నాటి దేశాలన్నీ భారత చేనేత ఉత్పత్తుల కోసం చేతులుచాపాయి. రాజకీయంగా స్వదేశీయత గురించి మాట్లాడడం సులభం. వైజ్ఞానికంగా, సాంకేతికంగా దాన్ని సాధించటం మాత్రం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. దాన్ని సాధించనంత కాలం మన స్వదేశీయంలో విదేశీయానిదే విజయమవుతుంది! అన్నిరంగాల్లో లోతైన విషయ విజ్ఞానాన్నీ, సాంకేతిక చాతుర్యాన్నీ సమకూర్చుకోబట్టే చైనా తన గొంతును బలంగా విన్పించగలుగుతోంది. ఇటీవల చైనాలో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ దాన్ని మనసుపెట్టి వినకా తప్పలేదు. క్షీణిస్తున్న శక్తిగా అమెరికా మారుతోందని చైనా అధినేత అంటే గట్టిగా ఖండించలేకపోయారు. అది చాలదన్నట్లుగా తైవాన్ స్వతంత్రతపై అమెరికా హామీ ఇవ్వలేదంటూ చేతులెత్తేశారు. అమెరికాతో మనకంటే ఎక్కువగా ఆర్థిక బంధాలను పెనవేసుకుని చైనా ఈ స్థాయికి వచ్చింది. స్వల్పకాలంలో అనూహ్య సామర్థ్యాన్నీ చాకచక్యాన్నీ సంపాదించుకుని ఆ దేశానికి అన్నిరంగాల్లో సవాళ్లను విసురుతోంది. ఆ స్థితికి చేరుకోటానికి అడుగులు వేయటమే మనముందున్న అసలు సవాల్! ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ దాన్ని సాధించటంలోనే అసలైన ఆత్మనిర్భరత లభిస్తుంది.

# అలుపెరుగని అభ్యుదయ సాహిత్య ప్రయాణం

మార్క్సిజం తాత్విక సిద్ధాంతంగా, అంతర్జాతీయ వాదం స్వభావంగా, శ్రామిక వర్గం పక్షపాతంగా, బోల్షెవిక్ విప్లవం తక్షణ స్ఫూర్తిగా, సమసమాజం స్వప్నంగా ప్రపంచమంతా పుట్టిన సాహిత్యం అభ్యుదయ సాహిత్యం. ప్రపంచ అభ్యుదయ సాహిత్యంలో అంతర్భాగం భారతీయ అభ్యుదయ సాహిత్యం; అందులో అంతర్భాగం తెలుగు అభ్యుదయ సాహిత్యం. అభ్యుదయ సాహిత్యానికి ప్రచారవేదిక అభ్యుదయ రచయితల సంఘం (అరసం). భారతదేశంలో 1936లోను, తెలుగునాట 1943లోను అరసం సంస్థలు పుట్టాయి. తెలుగు అభ్యుదయ సాహిత్యం 1933 జూన్ రెండున అచ్చయిన శ్రీశ్రీ 'జయభేరి' కవితతో మొదలైంది. తొంభై మూడేళ్ళ చరిత్ర నింపుకున్నది. అభ్యుదయ రచయితల సంఘం ఎనభై మూడేళ్ల చరిత్ర నింపుకున్నది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఇరవయ్యవ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో ఈ నెల 23, 24 తేదీలలో జరుపుకుంటున్న నేపథ్యంలో ఒకసారి సింహావలోకనం చేసుకుంటే వందలకొద్దీ అభ్యుదయ రచయితలు అభ్యుదయ సాహిత్య చరిత్ర నిర్మాణం చేశారు. వందలకొలది సాహిత్య కార్యకర్తలు అరసం నిర్మాణంలో పాల్గొన్నారు. వీరి లక్ష్యం ప్రజావ్యతిరేక సాహిత్య నిర్మూలనం, ప్రజానుకూల సాహిత్య నిర్మాణం. అరసానిది గానీ, అభ్యుదయ సాహిత్యానిది గానీ నల్లేరు మీద బండి నడకగా సాగిపోలేదు. శరవేగంగా పరిగెత్తిన రోజులున్నాయి. మందకొడిగా నడిచిన రోజులూ ఉన్నాయి. రాజకీయ పరిణామాల ప్రభావంతో అరసం కూడా ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. 195565 దశాబ్దాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో స్తబ్దతా దశాబ్దం అన్నారు గానీ, అది నిజం కాదని రుజువు చేయడంలో అభ్యుదయ సాహిత్యం కూడా ఆధారమైంది. అయినా 1965 తర్వాత దిగంబర కవిత్వం, విప్లవ సాహిత్య కాలంలో అరసం, అభ్యుదయ సాహిత్యం తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొన్నాయి. హేళనకు గురయ్యాయి. అయితే ఏ ఉద్యమానికైనా గుంటమిట్టలు ఉంటాయని ఆ తర్వాత తెలుగు సమాజం, సాహిత్య పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఇదిలా ఉంచుదాం. భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలను ధిక్కరించి, సామ్యవాద వ్యవస్థకు అనుకూలంగా భావ ప్రచారం చేసేది అభ్యుదయ సాహిత్యం. ఇది ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచేది. శ్రమదోపిడీ, మతమౌఢ్యం, ఆధిపత్య ఉన్మాదం, సాంఘిక వివక్ష వంటి తిరోగమన అంశాలను శత్రువులుగా పరిగణిస్తుంది అభ్యుదయ సాహిత్యం. ఇది సమాజాన్ని భౌతిక దృష్టితో, వర్గం దృక్పథంతో విశ్లేషిస్తుంది. అదే సమయంలో సంక్లిష్టమైన భారతదేశ సామాజిక నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకొని అస్తిత్వ వాదాలను అరసం ఆలింగనం చేసుకుంటుంది. అసమ సమాజంలో అరసం పీడితుల పక్షం వహిస్తుంది. మానవ సంబంధాలలో ఆర్థికాంశం పాత్రను రుజువు చేయడంతో, శ్రమదోపిడీని ప్రతిఘటించడంతో మొదలై, క్రమంగా అనేక సాంఘిక వివక్షలను, ఆధిపత్యాలను ప్రతిఘటించే దశకు చేరుకుంది అభ్యుదయ సాహిత్యం. అరసం ఈ పరిణామాన్ని ప్రచారం చేసింది. 1969లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని సమర్థించని అరసం, 1991 తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆఖరి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడం ఒక పరిణామం. ప్రపంచీకరణ దుష్పరిణామాలను ఎండగట్టడంలో అరసం గానీ, అభ్యుదయ సాహిత్యం గానీ వెనకపడలేదు. ఎస్వీ సత్యనారాయణ సంపాదకత్వంలో ప్రపంచీకరణ కథలు పుస్తకం వచ్చింది. ఇటీవల ఢిల్లీలో భారతీయ రైతుల తిరుగుబాటును సమర్థించడంలో అరసం క్రియాశీలక పాత్ర నిర్వహించింది. కవి సమ్మేళనం నిర్వహించి 'హలంతో కలం' కవిత్వ సంకలనం తెచ్చింది. అలాగే మణిపూర్‌లో మహిళలను దిగంబరంగా ఊరేగించి... ఆధిపత్యవాదులు చేసిన అమానుషత్వం మీద అరసం కవి సమ్మేళనం నిర్వహించి 'మణిపూర్ మంటలు' అనే కవితా సంకలనం తెచ్చింది. తెలుగు ప్రజలు బలిదానంతో, 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని పాలకులు ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడానికి ప్రయత్నించినప్పుడు అరసం తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఉక్కుకవనం' అనే కవితా సంకలనం తెచ్చింది. అరసం వంటి సంస్థ అసంఖ్యాకంగా పుస్తకాలను ప్రచురించడం విశేషం. ఈ తరం కోసం కథ, ఈ తరం కోసం కవిత అనే పేర్లతో గురజాడ నుంచి అనేక మంది ప్రజారచయితల కవితలను, కథలను దాదాపు 100 సంపుటాలు ప్రచురించింది. ఈ తరం కోసం వచన కవిత, ఈ తరం కోసం గేయ కవిత అనే మరో రెండు సంపుటాలు కూడా అరసం ప్రచురించింది. అవి విశేషంగా పాఠకాదరణ పొందాయి. ఇటీవలి గ్రంథాలయ పునరుజ్జీవనోద్యమంలోను, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమంలోను అరసం ఇతర ప్రజాతంత్ర సాహిత్య సంస్థలతో కలిసి కృషి చేసింది. ఇంకా ముందుకు పోతే తెలంగాణ రైతాంగ పోరాటంలోను, జమీందారీ వ్యతిరేక ఉద్యమంలోనూ అభ్యుదయ రచయితలు శ్రామికులు,

పీడితులు రైతుల పక్షాన నిలిచారు. అభ్యుదయ రచయితలు అనగానే శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, సోమసుందర్, రెంటాల, సినారె, గంగినేని, కుందుర్తి, నయాగరా కవులు, సురవరం ప్రతాపరెడ్డి, విద్వాన్ విశ్వం, సి.వి, కొడవటిగంటి కుటుంబరావు, మా గోఖలే, లక్ష్మీకాంతం మోహన్, దాశరథి రంగాచార్య, శారద, గజ్జెల మల్లారెడ్డి, ఉప్పల లక్ష్మణరావు, సుంకర వాసిరెడ్డి, సి.వి కృష్ణారావు, కేతు విశ్వనాథరెడ్డి వంటి మహా రచయితలు పాఠకుల ముందు నిలుస్తారు.

సృజన సాహిత్యంతో పాటు, సాహిత్య విమర్శలోనూ అభ్యుదయవాదులు అసమాన పాత్ర నిర్వహించారు. ఎం.ఆర్ చంద్ర, కొ.కు, శ్రీశ్రీ, రా.రా, వల్లంపాటి, సింగమనేని, ఆర్వీయార్, కె.వి.ఆర్, కొలకలూరి, వై.విజయకుమార్, నిడమర్తి, సొదుం రామ్మోహన్ వంటి అనేక మంది గుర్తుకొస్తారు.

## మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి వర్ధంతి.



**కేసముద్రం, మే 21(నంది పత్రిక):** నవ భారత నిర్మాత మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కేసముద్రం మార్కెట్ కార్యాలయంలో కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు స్థానిక నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలో సమాచార, సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసి, యువతకు నూతన అవకాశాలు తెరిచిన మహానేత రాజీవ్ గాంధీ అని తెలిపారు. కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ రంగ అభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం వంటి కీలక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో యువశక్తికి ప్రాధాన్యం పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, సీనియర్ నాయకులు బండారు దయాకర్, నీలం దుర్గేష్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ ఎండి అయూబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి, గ్రామ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, కొండ సురేష్, పోలేపల్లి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు ధారావత్ కిషోర్, తరాల వీరేష్ యాదవ్, గండి శ్రీనివాస్, చిలువేరు సమ్మయ్య గౌడ్, మాజీ సర్పంచ్ గదసిరి వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ లు ఎండి రఫీ, రడం శ్రీనివాస్, కనుకుల రాంబాబు, వల్లందాస్ రవి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్ యాదవ్, ప్రభాకర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు రఫీ ఖాన్, ఎండి రషీద్ ఖాన్, చేడుపెల్లి ఎలందర్, కళ్ళెం శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, కొల్లూరు శ్రీనివాస్, ఆంగోత్ బాల, శ్రీరామ్ కిరణ్, సామల నర్సయ్య, భూక్య అరుణ్, కాట్రేవుల హరికృష్ణ, ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా ?

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌలిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు. అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉంది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచరణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1
EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com